MAHANAGAR DINAPATRIKA

మహానగర్

విజయవాడ | సంపుటి : 10 | సంచిక : 289 | పేజీలు : 8 | గురువారం 8 అక్టోబర్ 2026 | వెల : 6-00



కోట్లాది మంది భారతీయుల విశ్వాసమే నా అతిపెద్ద బలం

- ప్రభుత్వాధినేతగా 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధాని మోదీ వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు
- 'సేవే లక్ష్యంగా స్వయంసేవకులు'
- తాను ఎప్పుడూ ఒంటరిగా భావించలేదు
- దేశ సాంస్కృతిక ఆత్మను కాపాడుతూ, భారత్‌కు సేవ చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్న అనేక మంది స్వయంసేవకులు, కార్యకర్తలు తనకు అండగా ఉన్నారు.
- ఒకప్పుడు మనకు ఉగ్రవాదం పెనుముప్పుగా ఉండేది


5



ఎన్నికల కమిషనర్ల నియామకాల తీర్పు రీకాల్‌పై పిటిషన్

- స్వీకరించిన సుప్రీంకోర్టు
- ఎన్నికల కమిషనర్ల నియామక చట్టంపై సుప్రీంకోర్టులో మరో కీలక మలుపు
- నాటి తీర్పును వెనక్కి తీసుకోవాలంటూ పిటిషన్ దాఖలైంది

ప్రపంచ స్థాయిలో మన విద్య



మంత్రివర్గ సమావేశంలో నిర్ణయాలు

రాష్ట్రంలో అంతర్జాతీయ విద్యాసంస్థల ఏర్పాటుకు పాలసీ

మరణించిన ఆశా కార్యకర్తలకు గ్రాట్యుటీ

గత ప్రభుత్వ హౌసింగ్ అక్రమాలపై మంత్రుల కమిటీ

విజయవాడ, మహానగర్

అంతర్జాతీయ విద్యాసంస్థలు, ప్రైవేటు విశ్వవిద్యాలయాలు తమ క్యాంపస్‌లను రాష్ట్రంలో ఏర్పాటుచేసేలా కొత్త విధానం. తల్లికి వందనం పథకంలో రెండో విడత చెల్లింపులు.. విధుల్లో ఉండగానే మరణించిన ఆశా కార్యకర్తల కుటుంబాలకు ఏడాదికి రూ.5 వేల చొప్పున గ్రాట్యుటీ చెల్లింపు.. ఉద్యాన పంటల సమగ్ర వివరాలతో ఓ వ్యవస్థ రూపకల్పన.. వంటి పలు నిర్ణయాలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఇప్పటికే ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసి, అమలు చేస్తున్న పలు నిర్ణయాలను మంత్రివర్గం రాటిపై చేసింది. సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో మొత్తం 12 అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకుంది. వాటి వివరాలను పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి విలేకరుల సమావేశంలో - మిగతా 2లో

ఎంపీలను కొడతారా.. ఇక్కడి నుంచి కదిలేదే లేదు



- నేలపై పడుకొని ప్రియాంక గాంధీ నిరసన
- జంతర్ మంతర్‌వైపు వెళ్తున్న ఇండియా కూటమి ఎంపీలను అడ్డుకున్న దిల్లీ పోలీసులు
- నేలపై పడుకొని నిరసన తెలిపిన ప్రియాంక గాంధీ
- పోలీసులు తనను గాయపరిచి కింద పడేశారని ఆగ్రహం!

5

త్వరలో డీపీఆర్

- గోదావరి డెల్టాలో రూ.13.4 కోట్లతో లైడార్ సర్వే పూర్తి
- రూ.13.4 కోట్లతో నిర్వహించిన లైడార్ సర్వే ఆధారంగా డీపీఆర్ సిద్ధం
- రూపొందుతున్న సమగ్ర ప్రాజెక్టు నివేదిక
- అవసరమైన నిధులను మంజూరు చేసేందుకు చర్యలు



విజయవాడ, మహానగర్

గోదావరి డెల్టా ప్రాంతంలో ఏటా వస్తున్న ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధునీకరణ పనులకు పకడ్బందీ కార్యాచరణ సిద్ధం చేస్తోంది. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అమరావతిలోని తన క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్ అధికారులు, సాంకేతిక నిపుణులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రూ.13 కోట్ల 40 లక్షల భారీ వ్యయంతో - మిగతా 3లో



యూపీ పీసీసీ అధ్యక్షురాలిగా ఆరాధన మిశ్రా

- బ్రాహ్మణ ఓట్లపై కాంగ్రెస్ గురి
- యూపీ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా బ్రాహ్మణ నేత ఆరాధన మిశ్రా నియామకం
- బ్రాహ్మణ ఓటర్లను ఆకర్షించేందుకు కాంగ్రెస్ పాత వ్యూహం
- 2017లోనూ ప్రశాంత్ కిశోర్ సలహాతో ఇదే ప్రయోగం విఫలం

5

ఓటర్ల జాబితాపై ప్రత్యేక డ్రైవ్



- 'అనర్హులను తొలగించడమే లక్ష్యం'
- సర్ ప్రక్రియలో ఓటర్ల జాబితా నుంచి అనర్హులుగా గుర్తించినవారిని గురువారం నుంచి బీఎల్ఓలు బూత్ స్థాయిలో పరిశీలన చేయనున్నారు.
- ఈ మేరకు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది.
- నేటి నుంచి సర్ ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని సీఈవో నిర్ణయం

విజయవాడ, మహానగర్

ఏపీలో సర్' ప్రక్రియలో భాగంగా ఓటర్ల జాబితా నుంచి అనర్హులుగా గుర్తించినవారిని నేడు (గురువారం) నుంచి బీఎల్ఓలు బూత్ స్థాయిలో పరిశీలన చేయనున్నారు. ఈ మేరకు నేటి నుంచి ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రధాన అధికారి వివేక్‌యాదవ్ వెల్లడించారు. ప్రతి అర్హతగల ఓటర్‌ను చేర్చి, ఓటర్ల జాబితాలో అనర్హుల నమోదులు ఏవీ మిగిలిపోకుండా చూడాలన్న భారత ఎన్నికల సంఘం లక్ష్యానికి అనుగుణంగా ఈ ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు వివరించారు. రాష్ట్రంలో ప్రత్యేక విస్తృత సవరణ, 2026 కింద జరిగిన గణన దశలో, బీఎల్ఓలు 15 జూన్ నుంచి 24 - మిగతా 2లో



దిల్లీలో కుప్పకూలిన ఐదంతస్తుల భవనం

- గర్భిణి, చిన్నారితో సహా ముగ్గురు మృతి
- సీమాపురిలో భవనం కుప్పకూలిన ఘటనలో ముగ్గురు మృతి
- మరో ఎనిమిది మందికి గాయాలు

5

డ్రగ్స్‌పై యుద్ధం

- సమష్టిగా కదులుదామన్న మంత్రి లోకేశ్
- ఆంధ్రప్రదేశ్‌ను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు కార్యాచరణ
- 'ఆపరేషన్ చైతన్యం', 'డ్రగ్స్ వద్దు బ్రో' కార్యక్రమాల విస్తరణకు ఆదేశం
- డ్రగ్స్ నివారణపై సమన్వయం కోసం త్వరలో దక్షిణాది రాష్ట్రాల కాంక్లేవ్
- అవగాహన కల్పించేందుకు మంత్రుల బృందం క్షేత్రస్థాయి పర్యటనలు
- గంజాయి రవాణాపై ఉక్కుపాదం, సరిహద్దుల్లో నిఘా పటిష్ఠం



విజయవాడ, మహానగర్

ఆంధ్రప్రదేశ్‌ను మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం తన కార్యాచరణను ముమ్మరం చేసింది. డ్రగ్స్ నిర్మూలనపై హోంమంత్రి వంగలపూడి అనిత అధ్యక్షతన ఉండవల్లిలో జరిగిన మంత్రుల బృందం సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ఈ లక్ష్యాన్ని సాధించాలని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు మంత్రుల బృందం క్షేత్రస్థాయిలో పర్యటించాలని - మిగతా 2లో

ప్రపంచ స్థాయిలో మన 'విద్య'

-మొదటిపేజీ తరువాయి

వెల్లడించారు. అంతర్జాతీయస్థాయి ఉన్నత విద్యాసంస్థలు, ప్రైవేట్ విశ్వవిద్యాలయాలను ఆకర్షించేందుకు, విద్యారంగంలో అంతర్జాతీయ భాగస్వామ్యాలు, పెట్టుబడులు, అత్యుత్తమ విద్యావకాశాలను పెంపొందించేలా.. 'ఏపీ విదేశీ ఉన్నత విద్యా సంస్థలు, ప్రైవేటు విశ్వవిద్యాలయాలు–2026' పాలసీకి మంత్రి మండలి ఆమోదం తెలిపింది. దీనిద్వారా విదేశీ ఉన్నత విద్యాసంస్థలు, దేశీయ ప్రైవేటు విశ్వవిద్యాలయాలు రాష్ట్రంలో తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేసుకునేందుకు అనుకూల వాతావరణం కల్పిస్తారు. ఫలితంగా ప్రపంచస్థాయి నాణ్యమైన చదువు ఇక్కడి విద్యార్థులకు అందుబాటులోకి వస్తుంది. ప్రైవేటు పాఠశాలల ఏర్పాటులో నిబంధనల సవరణ రాష్ట్ర విద్యావ్యవస్థకు సంబంధించిన నిబంధనల్లో మార్పులు తీసుకురావడానికి ఏపీ విద్యా చట్టం–1982లోని పలు సెక్షన్లను సవరిస్తూ, ఆర్డినెన్స్ జారీచేసే ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ప్రైవేట్ పాఠశాలల ఏర్పాటు, రిజిస్ట్రేషన్‌కు అనుమతి ఇచ్చేందుకు.. ఆ ప్రాంతంలో ముందుగా సర్వే చేయాలి, నోటిఫికేషన్ ఇవ్వాలి, అక్కడ బడి అవసరం ఉందని నిరూపించాలంటూ.. ఉన్న నిబంధనలను ఈ సవరణ ద్వారా తొలగిస్తారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన డీ రెగ్యులేషన్ అండ్ కంప్లయన్స్ రిడక్షన్ కార్యక్రమం రెండో దశలో భాగంగా ఈ మార్పు చేస్తున్నారు. దీనితోపాటు నిబంధనలను విద్యా హక్కు చట్టం–2009కి అనుగుణంగా మారుస్తారు. పాఠశాల భవన భద్రత, అగ్నిమాపక భద్రత, పారిశుద్ధ్యం, మౌలిక వసతులు, ఇతర విద్యా ప్రమాణాల విషయంలో సడలింపులు ఉండవు.

మరణించిన ఆశా కార్యకర్తలకు గ్రాట్యుటీ

విధుల్లో ఉండగానే మరణించిన ఆశా కార్యకర్తల కుటుంబాలకు ఎండ్–ఆఫ్–సర్వీస్ ప్రయోజనంగా గ్రాట్యుటీ అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సర్వీసు పూర్తిచేసిన ప్రతి సంవత్సరానికి రూ.5 వేలు చొప్పున, గరిష్ఠంగా రూ.1.50 లక్షల వరకు చెల్లించేందుకు ప్రతిపాదించారు. 2026–27 ఆర్థిక సంవత్సరంలో ఈ పథకం అమలుకు అవసరమయ్యే అంచనా గ్రాట్యుటీ రూ.2.19 కోట్ల మంజూరుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. 146 మంది ఆశా కార్యకర్తల కుటుంబాలకు ఆర్థిక ప్రయోజనం దక్కనుంది.

ఉద్యాన సమాచార, నిర్వహణ విధానం



రాష్ట్రంలో ఉద్యాన పంటల సమాచారాన్ని సమగ్రంగా సేకరించడం, నిర్వహించడం, విశ్లేషించడం, రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ఏపీ ఉద్యాన సమాచార, నిర్వహణ విధానం (ఏపీహెచ్ఐఎంఎస్) రూపొందించాలని నిర్ణయం. ఈ వ్యవస్థ రూపకల్పన, అభివృద్ధి, ఆపరేషన్, నిర్వహణ పనులు వస్సార్ ల్యాబ్స్ ఐటీ సొల్యూషన్స్ సంస్థకు అప్పగించే ప్రతిపాదనకు ఆమోదం.

45 రోజుల్లో ఇళ్ల స్థలాల సమస్య పరిష్కరించేందుకు కమిటీ

రాష్ట్రవ్యాప్తంగా ఇళ్ల స్థలాలకు సంబంధించిన సమస్యను 45 రోజుల్లో పరిష్కరించేందుకు సీఎం చంద్రబాబు.. ముగ్గురు మంత్రులతో కమిటీ ఏర్పాటు చేసినట్లు పౌరసంబంధాల, గృహనిర్మాణశాఖల మంత్రి పార్థసారథి తెలిపారు. ఇందులో తాను, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌తోపాటు, పర్యాటకశాఖ మంత్రి దుర్గేష్‌గాని, పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ గాని ఉంటారని వెల్లడించారు. ఇప్పటికే లేఅవుట్లో ఖాళీగా ఉన్న స్థలాలు, లబ్ధిదారులు వద్దనుకొని వదిలేసిన రిజిస్టర్డ్ స్థలాలకు సంబంధించి.. వాటి రిజిస్ట్రేషన్ రద్దుచేసి, అర్హులైన వారికి కేటాయించే విషయంపై ఈ కమిటీ ప్రభుత్వానికి నివేదిక అందజేస్తుందని పేర్కొన్నారు. ఆవాస్ సర్వేలో రెండు లక్షల మందికి ఇళ్ల స్థలాలు కావాలని గుర్తించడంతో, అందుకు భూ సేకరణ ఎలా చేయాలని అంశాన్ని కూడా కమిటీ పరిశీలించనుందని తెలిపారు. గత ప్రభుత్వంలో ఇళ్ల స్థలాల కోసం చేపట్టిన భూసేకరణలో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ నివేదిక వచ్చిందని, బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

10 శాతం డైట్ ఛార్జీలు పెంపు

సంక్షేమ వసతిగృహాలు, గురుకులాలు, ఇతర ప్రభుత్వ సంస్థల్లోని విద్యార్థులకు నెలవారీ డైట్ ఛార్జీలను 10 శాతం పెంచి, అన్ని సంక్షేమ శాఖలకు ఏకరీతి రేట్లను అమలుచేసేలా.. సాంఘిక సంక్షేమశాఖ ఈ నెల ఒకటిన జారీచేసిన ఉత్తర్వులను ర్యాటిఫై చేస్తూ మంత్రి మండలి నిర్ణయం తీసుకుంది. 6.28 లక్షల మంది విద్యార్థులకు ఈ పెంపు మేలు చేస్తుంది.

తల్లికి వందనం రెండో విడత 3.29 లక్షల మందికి

'తల్లికి వందనం' పథకం రెండో దశలో ఎంపికైన 3.29 లక్షల మంది అర్హులైన విద్యార్థులకు ఆర్థిక సాయం అందించడం, అర్హత కలిగిన 58,601 మంది విద్యార్థులను అదనంగా ఈ పథకం పరిధిలోకి తీసుకొచ్చేలా సవరించిన పరిపాలన అనుమతికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. గతంలో రూ.10,120.78 కోట్లకు పరిపాలన అనుమతి ఇవ్వగా, ఇప్పుడది రూ.10,208.69 కోట్లకు పెరిగింది.

త్వరలో డీపీఆర్

-మొదటిపేజీ తరువాయి

అత్యాధునిక లైడార్ సర్వేను పూర్తి చేశామని, దీని ఆధారంగా సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే తూర్పు డెల్టా ఆధునీకరణకు రూ.1,137 కోట్లు, సెంట్రల్ డెల్టా ఆధునీకరణకు రూ.1,268 కోట్లతో ప్రత్యేక ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. త్వరలోనే పశ్చిమ డెల్టా అంచనాలను కూడా పూర్తి చేసి అందించాలని అధికారులను ఆదేశించారు.

డెల్టా పరిధిలోని కాలువలు, డ్రెయిన్లు, బండ్ లెవెల్స్, డీసిల్టింగ్ (పూడికతీత), లాకులు, షట్టర్ల ఆధునీకరణ పనులకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి సూచించారు. ముఖ్యంగా పూడికతో పూర్తిగా నిండిపోయిన సీ మౌత్‌ల వద్ద డ్రెడ్జింగ్ చేపట్టేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని స్పష్టం చేశారు. ముమ్మిడివరం, అమలాపురం, రాజోలు, నరసాపురం, భీమవరం తదితర ప్రాంతాల్లో సముద్రంలో కలిసే ప్రధాన డ్రెయిన్ల పూడిక తొలగింపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. దశాబ్దాల కాలం నాటి శిథిలావస్థకు చేరిన లాకులు, అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లకు మరమ్మతులు చేపట్టడం లేదా అవసరమైన చోట కొత్త వాటిని నిర్మించడంపై కార్యాచరణ ఉండాలని పేర్కొన్నారు.

అవసరమైన నిధులను మంజూరు చేసేందుకు చర్యలు

సమగ్ర ప్రాజెక్ట్ నివేదికలను ఖరారు చేసే ముందు, స్థానిక నీటి సంఘాల సభ్యులు, ప్రజాప్రతినిధుల క్షేత్రస్థాయి అనుభవాలను పరిగణనలోకి తీసుకోవాలని ఐఐఎస్సీ టెక్నాలజీస్ ప్రతినిధులకు మంత్రి సూచించారు. ఈ నివేదికలు పూర్తిగా సిద్ధమైన తర్వాత, వాటిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి, అవసరమైన నిధుల మంజూరుకు కృషి చేస్తానని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో నీటిపారుదల శాఖ సలహాదారులు వెంకటేశ్వరరావు, గోదావరి డెల్టా చీఫ్ ఇంజనీర్ (జజు), సూపరింటెండింగ్ ఇంజనీర్ (రాజు) ఐఐఎస్సీ టెక్నాలజీస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ద్రగ్స్‌పై యుద్ధం

-మొదటిపేజీ తరువాయి

ఈ సమావేశంలో తీర్మానించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, యువతను, విద్యార్థులను డ్రగ్స్ మహమ్మారి బారి నుంచి కాపాడేందుకు బహుముఖ వ్యూహంతో ముందుకు సాగాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఇప్పటికే 'ఈగల్ క్లబ్'లను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో 'ఆపరేషన్ చైతన్యం', విద్యాసంస్థల సమీపంలో 'సేఫ్ క్యాంపస్ జోన్', యువత కోసం 'డ్రగ్స్ వద్దు బ్రో' వంటి కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని అధికారులను ఆదేశించారు. యూనివర్సిటీలు, కాలేజీల్లో విద్యార్థులతో నెలకోసారి టౌన్ హాల్ సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. డ్రగ్స్ నివారణపై ఇతర రాష్ట్రాలతో సమన్వయం కోసం త్వరలో విశాఖపట్నంలో దక్షిణాది రాష్ట్రాల కాంక్లేవ్ నిర్వహించాలని, సింథటిక్ డ్రగ్స్ నియంత్రణలో పంజాబ్ పోలీసుల అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. హోంమంత్రి అనిత మాట్లాడుతూ, ఒడిశా నుంచి గంజాయి రవాణాను అడ్డుకునేందుకు సరిహద్దు చెక్‌పోస్టుల్లో నిఘాను పటిష్ఠం చేశామని, డ్రోన్ల వినియోగాన్ని కూడా పెంచుతామని తెలిపారు. సమాజంలో చైతన్యం తెచ్చేందుకు 'బ్రేక్ ద సైలెన్స్' పేరుతో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆమె వివరించారు.

ఈగల్ ఐజీ ఆకె రవికృష్ణ మాట్లాడుతూ, రాష్ట్రంలో పట్టుబడిన గంజాయి చాక్లెట్లు బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి వచ్చినట్లు గుర్తించామని, ఆయా రాష్ట్రాల అధికారులను అప్రమత్తం చేశామన్నారు. ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు మందులు విక్రయిస్తున్న 20 మెడికల్ షాపులను సీజ్ చేశామని, విజయవాడ, రాజమండ్రి నగరాల్లోని బ్లేడ్ బ్యాచ్‌లపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. డ్రగ్స్ రవాణాను గుర్తించేందుకు 36 శిక్షణ పొందిన జాగిలాలను వినియోగిస్తున్నామని, రాపిడ్ డ్రగ్ డిటెక్షన్ కిట్లతో అనుమానితులకు పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 192 మంది పాత నేరస్థులను గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఈ సమావేశంలో మంత్రులు సత్యకుమార్ యాదవ్, కొల్లు రవీంద్ర, గుమ్మిడి సంధ్యారాణి, ఇంటిలిజెన్స్ చీఫ్ మహేశ్ చంద్ర లడ్డా, హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార విశ్వజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై ప్రత్యేక డ్రైవ్

-మొదటిపేజీ తరువాయి

జూలై, 2026 వరకు ఇంటింటి పర్యటన చేశారు. మరణం, శాశ్వత నివాస మార్పు, బహుళ నమోదులు, ఆచూకీ తెలియకపోవడం, ఇతర కారణాల వల్ల మొత్తం 44.89 లక్షల మంది ఓటర్లు వారు ఇచ్చిన చిరునామాలలో కనబడలేదని నివేదించారు. బీఎల్ఓలు ఇంటింటికీ గణన పూర్తి చేసి తర్వాత 3.71 కోట్ల మంది ఓటర్లతో కూడిన ముసాయిదా ఓటర్ల జాబితాలను జూలై 31న రాష్ట్రంలో ప్రచురించారు. ఏ ఒక్క అర్హతగల ఓటరును విస్మరించకూడదనే ఈసీఐ నిబద్ధతలో భాగంగా, నోటీసు దశలో ఏస్?డీడీ ఓటర్లు / అనర్హులైన ఓటర్ల పునఃపరిశీలన, కొత్త ఓటర్లు / విస్మరించిన ఓటర్ల నమోదు కోసం ఒక ప్రత్యేక డ్రైవ్‌ను చేపట్టాలని కమిషన్ నిర్ణయానికి అనుగుణంగా దీనిని నిర్వహిస్తున్నట్లు సీఈవో వివేక్‌యాదవ్ చెప్పారు.

46.62 లక్షల ఓట్లు తొలగింపు

ఈ డ్రైవ్‌లో భాగంగా, బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) రేపటి నుంచి, తొలగించబడిన 46.62 లక్షల మంది పేర్ల జాబితాలను పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్లి ఆ ఓటర్ల స్థితిని పునఃపరిశీలిస్తారని వివేక్‌యాదవ్ ప్రకటించారు. ఈ దశలో ఏదైనా ఓటర్ పొరపాటున తొలగింపు జరిగితే వారికి ఫారం–6 నింపడానికి అవకాశం కల్పించి, సరైన పరిశీలన తర్వాత నిరంతర నవీకరణలో భాగంగా వారి పేరును ఓటర్ల జాబితాలో చేర్చుతామని వెల్లడించారు. నోటీసుల దశలో ఈనెల 6 నాటికి మరో 1,73,071 మంది ఓటర్లు అర్హులు కారని తేలిందని వివేక్‌యాదవ్ పేర్కొన్నారు. వీరికి ఈనెల 16న ప్రచురించే తుది ఓటర్ల జాబితాలో చేర్చేందుకు అర్హులు కారని చెప్పారు. తుది ఓటర్ల జాబితాను ఈనెల 16 న ప్రచురిస్తామన్నారు. జనవరి 1, ఏప్రిల్ 1, జూలై 1 , అక్టోబర్ 1 అనే నాలుగు అర్హత తేదీలు అందుబాటులో ఉన్నాయని, ప్రతి ఏటా జనవరి ఒకటిని అర్హత తేదీగా పరిగణించి వార్షిక సారాంశ సవరణ జరుగుతుందని తెలిపారు. ఈనెల 16న తుది జాబితాలో పేరు లేని ఏ ఓటరైనా, తర్వాత అర్హత పొందిన ఏ వ్యక్తైనా నిరంతర నవీకరణ సమయంలో నమోదు కోసం ఫారం–6ను సమర్పించవచ్చునని వివేక్ యాదవ్ స్పష్టం చేశారు.

గాడిన పడుతున్న ఆర్థిక వ్యవస్థ

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి గుడ్ న్యూస్. ఆర్థిక కష్టాలతో ఇబ్బంది పడుతున్న ఆ రాష్ట్రం ఇప్పుడు గాడిలో పడుతుంది. చంద్రబాబు దార్శనీయకమైన పరిపాలన ఆ రాష్ట్రానికి ఆయువు పట్టు లాగా మారింది. ఆయన నాయకత్వంలో ఏపీ రాష్ట్రం అనేక రంగాలలో అభివృద్ధి సాధిస్తోంది. ఇప్పుడు ఏకంగా జాతీయ సగటును మించిపోయింది.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఖజానాకు జీఎస్టీ వసూళ్లు ఊరట కలిగించే విధంగా ఉన్నాయి. రాష్ట్రంలో పన్ను ఆదాయం పెరుగుతున్న నేపథ్యంలో ఆర్థిక కార్యకలాపాలలో కదలిక కొనసాగుతోంది. ముఖ్యంగా 2026 సెప్టెంబర్ లో ఏపీ నెట్ జిఎస్టి వసూళ్లు జాతీయ వృద్ధి సగటును మించిపోయాయి. దీంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రభుత్వం సంతృప్తి వ్యక్తం చేస్తోంది.2026 సెప్టెంబర్ నెలలో ఆంధ్రప్రదేశ్ నెట్ జిఎస్టి వసూళ్లు 3,182.87 కోట్లకు చేరుకున్నాయి. గత ఏడాది వసూళ్లు సెప్టెంబర్ నెలలో 2,789.50 కోట్లుగా ఉన్నాయి. గత ఏడాదితో పోల్చి చూస్తే వసూళ్ల వృద్ధి 14.1 సున్న శాతంగా నమోదయింది. ఇక ఇదే సమయంలో జాతీయస్థాయిలో పోస్ట్ సెటిల్మెంట్ నెట్ జిఎస్టి వృద్ధి రేటు సాగటు 8 శాతంగా ఉంది. అంటే జాతీయ సగటుతో పోల్చి చూస్తే ఏ అభివృద్ధి గణనీయంగా నమోదయింది.ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు పరిశీలిస్తే రాష్ట్ర నెట్ జిఎస్టి వసూళ్లు 19,635.49 కోట్లకు చేరుకున్నాయి. గత ఎడాది ఇదే కాలంలో 16,760.21 కోట్లుగా వసూళ్ళు ఉన్నాయి. గత ఏడాదితో పోల్చి చూస్తే ఏకంగా 18% వృద్ధి నమోదయింది. మొత్తం కమర్షియల్ ట్యాక్స్ వసూళ్లు కూడా సెప్టెంబర్ నాటికి 30,435.98 కోట్లకు చేరుకున్నాయి. గత ఏడాది ఇదే సమయానికి 25,892.92 కోట్లుగా ఉన్నది. గత ఏడాదితో పోల్చి చూస్తే వృద్ధిరేటు ఏకంగా 18% అధికంగా నమోదయింది.ఈ పెరుగుదలకు పన్ను చెల్లింపుల్లో మెరుగైన అనుసరణ.. కట్టుదిట్టమైన తనిఖీ.. రెవెన్యూ మానిటరింగ్.. ఆర్థిక కార్యకలాపాల విస్తరణ వంటివి కారణాలని అధికారులు చెబుతున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత డేటా అనలటిక్స్.. యూపీఐ లావాదేవీల విశ్లేషణ.. ఐ జిఎస్టి రివర్సల్స్ డిస్కం ఆదారిత రిజిస్ట్రేషన్ వెరిఫికేషన్ వంటి చర్యలను చంద్రబాబు ప్రభుత్వం అమలు చేయడంతో ఆదాయం పెరిగిపోయింది.ప్రభుత్వ చర్యలు మాత్రమే కాకుండా.. వినియోగం.. వ్యాపార కార్యకలాపాలు.. పన్ను అనుసరణ వంటి అనేక అంశాలు కూడా జీఎస్టీ వసూళ్లకు దోహదం చేశాయని వాణిజ్య శాఖ అధికారులు చెబుతున్నారు. జాతీయస్థాయిలో సెప్టెంబర్ 2026 లో మొత్తం స్థూల జిఎస్టి వసూళ్లు కూడా 14.7% పెరిగాయి. మొత్తంగా 2.3 లక్షల కోట్లకు చేరుకున్నాయి.

మింత్రా 'బిగ్ ఫ్యాషన్ ఫెస్టివల్'లో 80 లక్షలకు పైగా స్టైల్స్

విజయవాడ

పండుగ షాపింగ్ సీజన్‌ను స్వాగతిస్తూ మింత్రా ప్రతిష్టాత్మకమైన 'బిగ్ ఫ్యాషన్ ఫెస్టివల్'ను ప్రారంభించింది. ఈ ఏడాది ఉత్సవంలో 80 లక్షలకు పైగా ఫ్యాషన్ శైలులు, 100కు పైగా కొత్త బ్రాండ్‌లు అందుబాటులోకి రానున్నాయి. దేశవ్యాప్తంగా 21 వేల అభివృద్ధి చెందుతున్న బ్రాండ్‌లు, లేబుల్స్ తమ ఉత్పత్తులను వినియోగదారులకు పరిచయం చేయనున్నాయి. పురుషుల, మహిళల సంప్రదాయ దుస్తులు, పురుషుల సాధారణ దుస్తులు, మహిళల పాశ్చాత్య దుస్తులు, అందం, వ్యక్తిగత సంరక్షణ, గడియారాలు, ఆభరణాలు, క్రీడా పాదరక్షలు, గృహోపకరణాలు, జీవనశైలి విభాగాల్లో విస్తృత శ్రేణి ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయి. ప్రముఖ దేశీయ, అంతర్జాతీయ బ్రాండ్‌లతో పాటు కొత్త తరం బ్రాండ్‌లకు ఈ ఉత్సవం వేదికగా నిలవనుంది. మింత్రా వేగవంతమైన సరఫరా కోసం 'ఎం–నౌ' సేవను 12 నగరాల్లో 1,500 బ్రాండ్‌లకు విస్తరించింది. ఇందులో 1.5 లక్షల శైలులను 30 నిమిషాల్లో వినియోగదారులకు అందించే అవకాశం ఉంది. కృత్రిమ మేధ ఆధారిత సాంకేతికతతో వ్యక్తిగతీకరించిన షాపింగ్ అనుభవాన్ని అందిస్తోంది. పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా 26 వేలకుపైగా కాలానుగుణ ఉద్యోగాలను కూడా కల్పించింది.

దీపావళి సందర్భంగా ఎల్‌జీ ఆఫర్లు



విజయవాడ

గృహోపకరణాలు, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్‌పై 'సెలబ్రేషన్ ఆఫ్ ట్రస్ట్' పేరుతో దీపావళి ఆఫర్లను ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా ప్రకటించింది. ఎంపిక చేసిన మోడళ్లపై డెబిట్, క్రెడిట్ కార్డులతో గరిష్ఠంగా 26 శాతం లేదా రూ.30,000 వరకు క్యాష్‌బ్యాక్, రూ.888 నుంచి ఫిక్స్‌డ్ ఈఎంఐలు, జీరో డౌన్ పేమెంట్ సదుపాయాలను అందిస్తోంది. ఎంపిక చేసిన ఎల్‌జీ టీవీలపై మూడేళ్ల వారంటీ, సైడ్–బై–సైడ్ రిఫ్రిజిరేటర్లపై రూ.14,190 విలువైన మినీ రిఫ్రిజిరేటర్ ఉచితంగా, ఎంపిక చేసిన వాటర్ ప్యూరిఫైయర్లపై రూ.4,200 విలువైన ఉచిత మెయింటెనెన్స్ వంటి ప్రయోజనాలు అందుబాటులో ఉంటాయని సంస్థ తెలిపింది. అలాగే కంప్రెసర్‌పై పదేళ్ల వారంటీ, ఎల్‌జీ బెస్ట్‌కేర్ ఏఎంసీపై 30 శాతం వరకు రాయితీ ప్రకటించింది. ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా కో–చీఫ్ సేల్స్ అండ్ మార్కెటింగ్ ఆఫీసర్ సంజయ్ చిట్కారా మాట్లాడుతూ భారతీయ కుటుంబాలు ఎల్‌జీపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతగా పండుగ సీజన్‌లో మరిన్ని ప్రయోజనాలు అందిస్తున్నామని తెలిపారు. క్యాష్‌బ్యాక్, సులభమైన ఈఎంఐలు, జీరో డౌన్ పేమెంట్, పొడిగించిన వారంటీతో కొత్త ఉత్పత్తుల కొనుగోలు సులభతరం చేస్తున్నామన్నారు. 2026లో వాషింగ్ మెషీన్లు, రిఫ్రిజిరేటర్లు, మైక్రోవేవ్‌లు, టీవీల విభాగాల్లో విశ్వసనీయ బ్రాండ్‌గా గుర్తింపు పొందినట్లు సంస్థ పేర్కొంది. ఈ ఆఫర్లు నవంబర్ 15 వరకు అందుబాటులో ఉంటాయి.

ఏపీలో ఫినోలెక్స్ కేబుల్స్ విస్తరణ



విజయవాడ, మహానగర్

విద్యుత్, కమ్యూనికేషన్ కేబుల్స్ తయారీలో ప్రముఖ సంస్థ ఫినోలెక్స్ కేబుల్స్ రాష్ట్రంలో వ్యాపార విస్తరణకు వేగం పెంచింది. గత ఏడాది రాష్ట్రంలో రూ.300 కోట్లకు పైగా ఆదాయం నమోదు చేసిన సంస్థ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏపీలో 40--50 శాతం వృద్ధిని లక్ష్యంగా పెట్టుకుంది. డేటా కేంద్రాలు, సౌర విద్యుత్ ప్రాజెక్టులు, డిజిటల్ మౌలిక వసతుల నుంచి పెరుగుతున్న డిమాండ్‌ను అందిపుచ్చుకునేందుకు కొత్త ఉత్పత్తులను మార్కెట్‌లోకి తీసుకొస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్రంలో 20 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో కొత్త గిడ్డంగిని ఏర్పాటు చేసింది. గతంలో ఉన్న 6 వేల చదరపు అడుగుల గిడ్డంగితో పోలిస్తే ఇది గణనీయంగా పెద్దదని సంస్థ తెలిపింది. నిల్వలు, ఆర్డర్ల నిర్వహణను మెరుగుపరిచేందుకు సాంకేతిక పరిజ్ఞానం, సంకేత గుర్తింపు విధానాన్ని వినియోగిస్తున్నట్లు పేర్కొంది. విజయవాడలో మంగళవారం ఫోర్టివా క్యాట్--6 లాన్ కేబుల్, నెక్స్‌క్లియర్ క్యాట్--6 నిఫా కేబుల్‌ను విడుదల చేసింది. మార్కెట్‌లోని సాధారణ ఉత్పత్తులతో పోలిస్తే వీటి ధరలు 50--70 శాతం తక్కువగా ఉంటాయని తెలిపింది. నాణ్యత ప్రమాణాలతో పాటు ప్రమాదకర పదార్థాల నియంత్రణ నిబంధనలకు అనుగుణంగా వీటిని రూపొందించినట్లు పేర్కొంది. ఇవి 1,000 ఎంబీపీఎస్ వేగానికి అనుకూలమని తెలిపింది. కొత్త అగ్ని ప్రమాద హెచ్చరిక కేబుల్‌ను కూడా పరిచయం చేసింది. ఫినోలెక్స్ కేబుల్స్ అధ్యక్షుడు (విక్రయాలు, మార్కెటింగ్) అమిత్ మాథుర్ మాట్లాడుతూ ఏపీ, తెలంగాణ తమకు కీలక మార్కెట్లని తెలిపారు. ప్రస్తుతం ఏపీలో 200కు పైగా పంపిణీ భాగస్వాములు, ఏపీ--తెలంగాణలో కలిపి సుమారు 500 మంది భాగస్వాములు, 30 వేలకు పైగా రిటైలర్లు ఉన్నారని వెల్లడించారు.

అఖండ విజయం సాధించేందుకు సమిష్టిగా కృషి చేయాలి - ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

అవనిగడ్డ, మహానగర్



రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూటమి అభ్యర్థులకు ఏయే స్థానాలు నిర్ధారిస్తే ఆయా స్థానాల్లో అఖండ విజయం సాధించేందుకు సమిష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పిలుపునిచ్చారు. వైసీపీ నుంచి జనసేన పార్టీలో భారీగా చేరికలు జరిగాయి. బుధవారం సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. కోడూరు మండలం మాచవరం జనసేన పార్టీ నాయకులు రెడ్రౌతు కృష్ణబాబు, కూరాకుల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జనసేన పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ పార్టీ కండువాలతో స్వాగతం పలికారు. వైసీపీ నుంచి జనసేన పార్టీలో చేరిన వారిలో విస్సంశెట్టి గంగారావు, విస్సంశెట్టి పున్నారావు, కూరాకుల సుబ్బారావు, కూరాకుల శివరామకృష్ణ, కోట ఆదిశేషు, జరుగు రామాంజనేయులు, నల్లూరి రమేష్, కూరాకుల ఆంజనేయులు, నల్లూరి వెంకటేశ్వరరావు, కూరాకుల మధు, నల్లూరి రామాంజనేయులు, నల్లూరి నాగ రమేష్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ మాచవరంతో తనకు చిరకాలంగా అనుబంధం ఉందని, తనకు ప్రతినిత్యం ఈ గ్రామం అండగా నిలిచిందన్నారు. కూటమి బలోపేతానికి, పవన్ కళ్యాణ్ ఆశయాలు గ్రామాలు అభివృద్ధి పథంలో నడుపుతున్న తీరు గమనించి మాచవరం గ్రామ వైసీపీ నాయకులు, కార్యకర్తలు జనసేన పార్టీలో చేరటం సంతోషదాయకం అన్నారు. గత ఎన్నికల్లో జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ టీడీపీ, బిజెపిలను కలిపి కూటమి ఏర్పాటులో కీలక పాత్ర పోషించారన్నారు. వైసిపి అరాచక పాలన అంతమొందించిన ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగా, పల్లెల ప్రగతికి కీలకంగా నిలిచే పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖను ఎంచుకున్న జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ వైసీపీ పాలనలో అస్తవ్యస్తంగా మారిన ఆర్థిక వ్యవస్థ కారణంగా అభివృద్ధికి నోచుకోని అనేక రహదారుల అభివృద్ధికి కేంద్రం నుంచి నిధులు సాధించి తెస్తున్నారన్నారు. తద్వారా అవనిగడ్డ నియోజకవర్గంలో ఇప్పటికే విస్తృత సంఖ్యలో పంచాయతీరాజ్ శాఖ ద్వారా ప్రధాన, గ్రామీణ రహదారుల నిర్మాణం సాకారం చేసినట్లు తెలిపారు. పల్లెల ప్రగతికి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేస్తున్న కృషిని గ్రామీణ ప్రజలు నిశితంగా గమనిస్తున్నారన్నారు. వైసీపీ హయాంలో అధ్వానంగా మారిన కోడూరు రోడ్డు కారణంగా ఈ గ్రామాల ప్రజలందరూ తీవ్ర ఇబ్బంది ఎదుర్కొన్నారన్నారు. ఈ ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కృషితో గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధిని, వాస్తవ పరిస్థితిని గమనించి జనసేనకు అండగా నిలవాలని మాచవరం గ్రామ వైసీపీ నాయకులు ఆ పార్టీని వీడి జనసేన పార్టీలో చేరడం శుభ పరిణామం అన్నారు. మాచవరం గ్రామంలో గత టీడీపీ ప్రభుత్వంలోనూ, ఈ ప్రభుత్వంలోనూ అనేక సీసీ రోడ్లు నిర్మించామని మరిన్ని సీసీ రహదారులు నిర్మిస్తామన్నారు. పవన్ కళ్యాణ్ సహకారంతో డొంక రోడ్లు కూడా నిర్మిస్తామని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూటమి అభ్యర్థులకు ఏయే స్థానాలు నిర్ధారిస్తే ఆయా స్థానాల్లో అఖండ విజయం సాధించేందుకు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. తద్వారా గ్రామాల అభివృద్ధికి చేయి చేయి కలిపి ముందుకు సాగాలన్నారు. గతంలో ఉన్న బేధాభిప్రాయాలు పక్కనపెట్టి ముందుకు సాగి మాచవరంలో అజేయ శక్తిగా ఎదగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ జరుగు ఆదినారాయణ, జనసేన పార్టీ నాయకులు జరుగు పోతురాజు, జరుగు లక్ష్మణ, అరజా నగరాయలు తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలను చూసీ చూడనట్లు వ్యవహరించి ప్రభుత్వానికి చెడ్డపేరు తేవద్దు

అధికారులకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచన



అవనిగడ్డ, మహానగర్

అక్రమాలను చూసీచూడనట్లు వ్యవహరించి ప్రభుత్వానికి చెడ్డపేరు తేవద్దని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అధికారులకు సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గంలోని అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ బియ్యం అక్రమ రవాణా జరగకుండా అరికట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పదేపదే చెబుతుంటే, అధికారులు పట్టించుకోకపోవడం సరికాదన్నారు. సీఎం, డిప్యూటీ మార్గదర్శకాలను తాను ప్రతి సమావేశంలోను అధికారుల దృష్టికి తీసుకువస్తున్నట్లు తెలిపారు. ఈ తరహా అక్రమాలను ఎట్టి పరిస్థితుల్లోను ప్రోత్సహించేది లేదని స్పష్టం చేశారు. నాగాయలంకలో రేషన్ బియ్యం ఎవరో పట్టించే వరకూ పట్టుకోలేని పరిస్థితిలో ఉండకూడదని, ప్రభుత్వానికి ఎంత చెడ్డపేరు వస్తుందో ఆలోచించాలన్నారు. నియోజకవర్గంలో పనితీరుపై ముఖ్యమంత్రి సర్వేలు చేయిస్తూ ర్యాంకులు ఇస్తున్నప్పుడు మనం ఎంత జాగ్రత్తగా వ్యవహరించాలో ఆలోచించాలని సూచించారు. ప్రభుత్వం ద్వారా జరిగే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల కంటే, అవినీతి, అక్రమాలు ర్యాంకులపై ప్రభావం చూపిస్తాయన్నారు. పేదలకు ఇచ్చే రేషన్ బియ్యం అక్రమ మార్గం పట్టకుండా శ్రద్ధ చూపాలని ప్రభుత్వం స్పష్టంగా చెబుతున్నా, క్షేత్ర స్థాయిలో రెవిన్యూ, పోలీస్ అధికారులు బాధ్యతగా పనిచేసి అక్రమ రవాణా అరికట్టాలని స్పష్టం చేశారు. ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చే ఇలాంటి నిర్లక్ష్య వైఖరి కొనసాగించ వద్దని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల బాధ్యతలు చేపట్టిన మండల ప్రత్యేక అధికారులు పారదర్శకంగా, అవినీతి రహితంగా పరిపాలన చేయాలన్నారు. గ్రామాల్లో సురక్షిత త్రాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అసంపూర్తి భవనాలు పూర్తి చేసి ప్రారంభాలకు సిద్ధం చేయాలని సూచించారు. అందుబాటులో ఉన్న నిధులతో గ్రామ సచివాలయ భవనాలు, రక్షిత మంచినీటి పథకాలకు అవసరమైన పనులు, ప్రభుత్వం మంజూరు చేసిన జల జీవన్ మిషన్ నిధులతో త్రాగునీటి సౌకర్యాల కల్పనపై దృష్టి సారించాలని సూచించారు. గతంలో అవనిగడ్డ నియోజకవర్గానికి రాష్ట్ర స్థాయిలో 11వ ర్యాంక్, జిల్లాలో మొదటి ర్యాంక్ వచ్చిందని, అధికార యంత్రాంగం అందుకు అనుగుణంగా పని చేయాలని సూచించారు. సమావేశంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబు, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సరస్ మేళా, దసరా ఉత్సవాలు, విజయవాడ ఉత్సవ్‌లతో

నగరానికి కొత్త శోభ

విజయవాడలో పండుగల సందడి
దేశం నలుమూలల నుంచి వచ్చే అతిథులకు విజయవాడ ఆతిథ్యం అందిద్దాం
ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)



విజయవాడ, మహానగర్

రానున్న పది రోజుల్లో నగరం పండుగల వేదికగా మారనుందని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సరస్ మేళా, దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు, విజయవాడ ఉత్సవ్--2.0 ఒకేసారి జరగడం నగర ప్రజలకు ప్రత్యేక సందర్భమని తెలిపారు. బుధవారం నగరంలోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన, ఈ నెల 13 నుంచి 30వ తేదీ వరకు పున్నమి ఘాట్‌లోని సుమారు 18 ఎకరాల్లో సరస్ మేళా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ నెల 15న భారత రాష్ట్రపతి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాల స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన ఉత్పత్తులతో సుమారు 650 స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నామని, దాదాపు 2,500 మంది ప్రతినిధులు పాల్గొంటారని వివరించారు. వివిధ రాష్ట్రాల సంప్రదాయ వంటకాలను పరిచయం చేసే ఫుడ్ ఫెస్టివల్ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందన్నారు. సరస్ మేళా మహిళల స్వయం ఉపాధి, ఆర్థిక సాధికారతకు వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. దసరా ఉత్సవాలు, సరస్ మేళా, విజయవాడ ఉత్సవ్ ఒకేసారి జరగడం మూడు పండుగలు వచ్చినట్లేనని, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, ప్రముఖులు నగరానికి రానున్నారని చెప్పారు. ప్రముఖుల పర్యటనల సందర్భంగా భద్రతా కారణాలతో ప్రజలకు కొంత అసౌకర్యం కలగవచ్చని, అందరూ సహకరించాలని కోరారు. దేశం నలుమూలల నుంచి వచ్చే అతిథులకు ఆతిథ్యం అందించేలా నగరంలోని ప్రతి ఇల్లు, వ్యాపార సంస్థను అలంకరించుకోవాలని పిలుపునిచ్చారు. విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా తుమ్మలపల్లి కళాక్షేత్రంలో పిల్లలు, యువత కోసం 50కి పైగా విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నామని, స్థానిక ప్రతిభను వెలికితీయడమే లక్ష్యమన్నారు. లైవ్ కబడ్డీ, వాలీబాల్ పోటీలతో పాటు విజయవాడలో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్--కర్ణాటక రంజీ మ్యాచ్‌కు అంతర్జాతీయ క్రికెటర్లు, ప్రముఖులు హాజరుకానుండటం మరో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని తెలిపారు. దసరా ఉత్సవాలు, సరస్ మేళా, విజయవాడ ఉత్సవ్‌ను ప్రజలు, మీడియా, వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు కలిసి విజయవంతం చేయాలని ఎంపీ కేశినేని చిన్ని కోరారు.

కృష్ణా వర్సిటీ అంతర్ కళాశాల చెస్ పోటీల్లో కేబీఎన్ కళాశాలకు ప్రథమ స్థానం



విజయవాడ, మహానగర్

నగరంలోని సప్తగిరి డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో బుధవారం కృష్ణా విశ్వవిద్యాలయ అంతర్ కళాశాల మహిళా చెస్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. కళాశాల కార్యనిర్వహకులు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. రఘురామ్ అధ్యక్షతన జరిగిన ఈ పోటీల్లో వివిధ కళాశాలలకు చెందిన మహిళా క్రీడాకారులు పాల్గొన్నారు. సప్తగిరి ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ, కరస్పాండెంట్ సీహెచ్ మన్మధరావు ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీల్లో విజయవాడ కేబీఎన్ కళాశాల జట్టు ప్రథమ స్థానం సాధించగా, ఎస్‌డీఎంఎస్ఎం కళాశాల ద్వితీయ స్థానం, కేవీఎస్ఆర్ సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ మూడో స్థానం, ఉయ్యూరు ఏజీఎస్‌జీ సిద్ధార్థ కళాశాల నాలుగో స్థానం సాధించాయి. కృష్ణా విశ్వవిద్యాలయ వ్యాయామ సంఘ కార్యదర్శి బి.చి. సంగీతారావు పాల్గొని క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు.

అన్ని వర్గాల మద్దతుతో విజయవాడ ఉత్సవ్ 2.0

రవాణా, బీసీ సంఘాలతో ఎంపీ కేశినేని చిన్ని భేటీ
'మన ఉత్సవ్'గా విజయవాడ ఉత్సవ్‌ను విజయవంతం చేద్దామని పిలుపు





విజయవాడ, మహానగర్

విజయవాడ ఉత్సవ్--2.0ను ప్రజలందరి పండుగగా తీర్చిదిద్దేందుకు అన్ని వర్గాల భాగస్వామ్యం అవసరమని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. విజయవాడ ఉత్సవ్ ప్రచారం, దేవి శరన్నవరాత్రి ఉత్సవాల నిర్వహణపై బుధవారం వివిధ సంఘాల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్స్ అసోసియేషన్లు విజయవాడ ఉత్సవ్ ప్రచారంలో భాగంగా రవాణా వాహనాలపై ఉత్సవ్ ప్రచార స్టిక్కర్లు ఏర్పాటు చేస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నందుకు ఎంపీ అభినందించారు. రవాణా వాహనాలు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు నిరంతరం ప్రయాణిస్తుండటంతో ఉత్సవ్ సందేశం విస్తృతంగా ప్రజల్లోకి చేరుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బస్సులపై విజయవాడ ఉత్సవ్--2.0 ప్రచార స్టిక్కర్‌ను ఎంపీ స్వయంగా అంటించారు. అనంతరం తన కార్యాలయంలో వివిధ బీసీ సంఘాల నాయకులతో సమావేశమైన ఆయన, విజయవాడ ఉత్సవ్‌ను ప్రతి ఒక్కరూ 'మన ఉత్సవ్'గా భావించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. విజయవాడకు ఉన్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవాన్ని దేశవ్యాప్తంగా చాటిచెప్పేలా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు, విజయవాడ ఉత్సవ్‌ను ఘనంగా నిర్వహించాలని, మైసూరు దసరా ఉత్సవాలకు దీటుగా విజయవాడ ఉత్సవాలను నిర్వహించే దిశగా అందరూ కలిసి కృషి చేయాలని సూచించారు. నగరంలోని వ్యాపార, వాణిజ్య సంస్థలు, వృత్తి, సామాజిక, బీసీ, ప్రజా సంఘాలు ఉత్సవాల్లో భాగస్వాములై తమవంతు సహకారం అందించాలని కోరారు. ప్రజల భాగస్వామ్యంతో విజయవాడ ఉత్సవ్--2.0ను రాష్ట్రంలో ప్రత్యేక సాంస్కృతిక ఉత్సవంగా నిలిపేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమాల్లో టీడీపీ సీనియర్ నాయకులు బొప్పన భవకుమార్, ఈశ్వరరావు, రాజా, రావి గోపాలరావు, పొట్లూరి సాయిబాబు, కొల్లి మురళి, యార్లగడ్డ సుందర్‌రావు, కోనేరు కిషోర్, బీసీ సంఘాల నాయకులు గొట్టిముక్కల రఘురామరాజు, కాకు మల్లికార్జున యాదవ్, ఎం.వి. రావు, నమ్మి అప్పారావు యాదవ్, మేక వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు వ్యసనం, ప్రజారోగ్య విధాన రూపకల్పనలో సైన్సు పాత్రపై ప్రపంచ సదస్సులో చర్చ

విజయవాడ

సెప్టెంబరు 28 నుంచి 30 వరకు వర్చువల్‌గా జరిగిన 9వ పొగాకు హాని తగ్గింపు సదస్సులో పొగాకు వ్యసనం, కొత్తగా వెలువడుతున్న శాస్త్రీయ ఆధారాలు, పొగాకు నియంత్రణ విధానాలపై నిపుణులు చర్చించారు. ధూమపానం మాన్పించడం, యువతను పొగాకు, నికోటిన్ వినియోగం నుంచి రక్షించడం, ప్రజారోగ్య విధానాల్లో శాస్త్రీయ ఆధారాల ప్రాధాన్యతపై సమావేశంలో దృష్టి సారించారు. పద్మశ్రీ ప్రొఫెసర్ డాక్టర్ మోసిన్ వలీ మాట్లాడుతూ, ధూమపానం మానేయాలని చెప్పడం, వారు నిజంగా మానేందుకు సహాయం చేయడం వేర్వేరు అంశాలని పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న శాస్త్రీయ ఆధారాలను నిష్పక్షపాతంగా పరిశీలించి విధానాలను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, శాన్‌ఫ్రాన్సిస్కోకు చెందిన ప్రొఫెసర్ నీల్ ఎల్. బెనోవిట్జ్ నికోటిన్ వ్యసనం, గుండె సంబంధిత ప్రభావాలు, యువతపై దాని ప్రభావాలను వివరించారు. సిగరెట్ వల్ల కలిగే హానిని నికోటిన్ ప్రభావాల నుంచి వేరు చేసి చూడాలని సూచించారు. యువత రక్షణతో పాటు వయోజన ధూమపానం చేసేవారికి మాన్పించే సహాయం అందించాలని నిపుణులు పేర్కొన్నారు.

అమెరికా నిజంగానే

దివాళా తీస్తుందా?

మొదటి నుంచీ ఎలాన్ మస్క్‌కి ఒక ప్రత్యేకత ఉంది. ఇతరులు భవిష్యత్తు గురించి ఆలోచిస్తున్నప్పుడు.. తాను ఆ భవిష్యత్తును తయారు చేయాలని ప్రయత్నిస్తుంటారు. ఎలక్ట్రిక్ కార్ల నుంచి అంతరిక్ష ప్రయాణం వరకు ఆయన చేసిన ప్రయోగాలు అందుకు ఉదాహరణ. అందుకే అమెరికా ఆర్థిక భవిష్యత్తుపై ఆయన చేసిన హెచ్చరికను కూడా మార్కెట్లు, టెక్ ప్రపంచం, పెట్టుబడిదారులు ఆసక్తిగా గమనిస్తున్నాయి. " అమెరికా దివాళా తీసే అవకాసం ఉంది" అని చెప్పినప్పుడు అది సాధారణ కామెంట్‌గా మిగలలేదు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వర్గాల్లో చర్చ మొదలైంది.మస్క్ చెప్పింది నిజంగా అమెరికా రేపే దివాళా తీస్తుందన్న హెచ్చరికేనా? లేక భారీగా పెరుగుతున్న అప్పులు, వడ్డీ భారం, బడ్జెట్ లోటు గురించి ఆయన చెబుతున్న అసలు సమస్యను మనం మరో కోణంలో చూడాలనా? అమెరికా జాతీయ రుణం గురించి మాట్లాడినప్పుడు మస్క్ ఈ తీవ్రమైన హెచ్చరిక చేశారు. ఏఐ రోబోటిక్స్ సాంకేతికతలు గనుక లేకపోతే అమెరికా ఆర్థికంగా తీవ్ర చిక్కుల్లో పడుతుందని, అప్పుల ఊబి నుంచి గట్టెక్కడానికి ఇవి తప్ప మరో మార్గం లేదని ఆయన స్పష్టం చేశారు.అయితే మస్క్ మాటల అంతరార్థం "అమెరికా దగ్గర రూపాయి (డాలర్) కూడా లేకుండా పోయింది" అని కాదు; పెరుగుతున్న అప్పుల వేగాన్ని దేశ ఆర్థిక వృద్ధి దాటలేకపోతే అసలు సమస్య మొదలవుతుందనేదే ఆయన ఆందోళన. అమెరికా ఇప్పటికే అప్పులపై చెల్లిస్తున్న వడ్డీ ఖర్చు రికార్డు స్థాయికి చేరడమే ఈ భయానికి ప్రధాన కారణం.అమెరికా జాతీయ రుణం ఇప్పటికే 40 ట్రిలియన్ డాలర్ల మార్కును దాటేసింది. ప్రస్తుతం అమలులో ఉన్న ఆర్థిక విధానాలు దీర్ఘకాలంలో స్థిరంగా కొనసాగలేవని, రుణం–జీడీపీ నిష్పత్తి భవిష్యత్తులో మరింత ప్రమాదకరంగా మారుతుందని అమెరికా ట్రెజరీ స్వయంగా అంగీకరించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోందిఇక్కడ అసలు సమస్య అప్పు చేయడం మాత్రమే కాదు, దానిపై చెల్లిస్తున్న వడ్డీ భారం ఏటికేటా కొండలా పెరిగిపోవడం. ప్రస్తుతం అమెరికా ప్రభుత్వం కేవలం అప్పులపై వడ్డీ చెల్లించడానికే ఏడాదికి సుమారు 1 ట్రిలియన్ డాలర్లు ఖర్చు చేస్తోంది. అంటే ప్రభుత్వం సేకరించే ప్రతి ఐదు డాలర్ల ఆదాయంలో దాదాపు ఒక డాలర్ కేవలం వడ్డీలకే సరిపోతోంది. "అప్పు చేసి పప్పు కూడు తిన్నంత కాలం బాగానే ఉన్నా, అసలు కంటే వడ్డీయే ఎక్కువైనప్పుడు" అసలు కథ మొదలవుతుంది. అమెరికా విషయంలో సరిగ్గా ఇదే జరుగుతుండటంతో ఆర్థిక నిపుణులు కూడా తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రపంచవ్యాప్తంగా అత్యంత ఆమోదయోగ్యమైన 'రిజర్వ్ కరెన్సీ' అయిన డాలర్‌ను ముద్రించే అధికారం అమెరికాకు ఉంది. కాబట్టి దేశం పూర్తిగా దివాళా తీసి, మూతపడిపోతుందనే కోణంలో మస్క్ వ్యాఖ్యలను చూడలేం. కానీ, పెరుగుతున్న అప్పుల వల్ల వడ్డీ భారం పెరిగి, దానికోసం మరింత అప్పు చేయాల్సి రావడం, దానివల్ల మార్కెట్‌లో వడ్డీ రేట్లు మరింత పెరిగిపోవడం లాంటి 'డెట్ స్పైరల్' ఏర్పడే ప్రమాదం ఖచ్చితంగా ఉంది. దిగ్గజ ఆర్థికవేత్త రే డాలియో, జేపీ మోర్గాన్ సీఈఓ జేమీ డైమన్ వంటి వారు కూడా ఇదే రుణ విషవలయం గురించి అమెరికాను హెచ్చరించడం గమనార్హం.అప్పుల సుడిగుండం నుంచి బయటపడటానికి ఏ దేశానికైనా రెండే మార్గాలుంటాయి: ఒకటి ఖర్చులు తగ్గించుకోవడం, రెండు ఆర్థిక వ్యవస్థను వేగంగా పెంచడం. మస్క్ రెండవ మార్గాన్ని ఎంచుకున్నారు. రోబోటిక్స్ రంగాల వల్ల మానవ ఉత్పాదకత పదింతలు పెరిగితే, వస్తువులు, సేవల ఉత్పత్తి విపరీతంగా పెరుగుతుంది. తద్వారా ఆర్థిక వ్యవస్థ పరిమాణం పెరిగి, ప్రభుత్వానికి పన్నుల రూపంలో భారీ ఆదాయం వస్తుంది.ఫలితంగా అప్పు–జీడీపీ నిష్పత్తి తగ్గుతుందని మస్క్ భావిస్తున్నారు. ఆయన ఆలోచనలో రోబోట్ అనేది కేవలం ఒక యంత్రం కాదు, దేశ ఆర్థిక వ్యవస్థను పరుగులు తీగెత్తించే గ్రోత్ ఇంజిన్. అయితే, అంత త్వరగా అంతటి ఉత్పాదకతను సాధించగలదా లేదా అన్నది కాలమే నిర్ణయించాలి.అమెరికాలో పెద్ద ఆర్థిక సంక్షోభం తలెత్తితే అది వారి సొంత సమస్య మాత్రమే కాదని, గ్లోబల్ ఎకానమీలో భాగంగా భారత్‌పై కూడా దాని ప్రభావం ఖచ్చితంగా ఉంటుందని మనం గ్రహించాలి. అమెరికా బాండ్ యీల్డ్స్ పెరిగితే విదేశీ పెట్టుబడిదారులు భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న మార్కెట్ల నుంచి తమ డబ్బును ఉపసంహరించుకుని అమెరికా ఆస్తుల్లో పెట్టుబడి పెడతారు. దీనివల్ల భారత స్టాక్ మార్కెట్లలో హెచ్చుతగ్గులు రావడమే కాకుండా రూపాయి విలువ పడిపోయే అవకాశం ఉంది.డాలర్‌తో పోలిస్తే రూపాయి బలహీనపడితే మన దిగుమతుల ఖర్చు భారీగా పెరుగుతుంది. ముఖ్యంగా భారత్ అత్యధికంగా దిగుమతి చేసుకునే క్రూడ్ ఆయిల్ ధరలు పెరిగి, దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలతో పాటు రవాణా ఖర్చులు ప్రియమవుతాయి. రవాణా ఖర్చులు పెరిగితే నిత్యావసరాలు, కూరగాయల ధరలు పెరిగి హైదరాబాద్‌లో ఉండే ఒక సామాన్య కుటుంబం నెలవారీ బడ్జెట్‌పై నేరుగా ప్రభావం పడుతుంది. భారతీయ ఐటీ రంగానికి ఇది రెండు రకాల పరిణామాలను తెచ్చిపెట్టవచ్చు. ఒకవైపు అమెరికా కంపెనీలు ఖర్చులు తగ్గించుకోవడానికి ప్రాజెక్టులను కుదిస్తే ఐటీ అవుట్‌సోర్సింగ్‌పై ఒత్తిడి పెరుగుతుంది. మరోవైపు, తమ ఖర్చులను వేగంగా తగ్గించుకోవడానికి వారు ఆశ్రయిస్తే, మన ఐటీ కంపెనీలకు సరికొత్త అవకాశాలు తలుపు తడతాయిమొత్తానికి, మస్క్ చెప్పినట్లుగా అమెరికా వెంటనే దివాళా తీయకపోవచ్చు కానీ, పెరుగుతున్న అప్పులు మరియు వడ్డీ భారం నిజంగానే ఆ దేశానికి పెద్ద తలనొప్పిగా మారాయి. మస్క్ హెచ్చరికలో కొంత అతిశయోక్తి ఉన్నప్పటికీ, అమెరికా అప్పుల సమస్యను ప్రపంచం ఇక ఎంతమాత్రం నిర్లక్ష్యం చేయలేదనేది పచ్చి నిజం.అందుకే ఇప్పుడు ఆలోచించాల్సింది "అమెరికా దివాళా తీస్తుందా,లేదా?" అని కానే కాదు, పెరుగుతున్న అప్పుల భారం కంటే వేగంగా, అమెరికా తన ఆర్థిక వ్యవస్థను పరుగులు తీగెత్తించగలదా లేదా అనేదే! దీనికి కాలమే సమాధానం చెప్పాలి.

యూపీఐ చెల్లింపుల వెనుక ఖర్చెవరిది?



భారతదేశంలోని డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌స్పేస్ (యూపీఐ) ఒక విప్లవాత్మక మార్పు తీసుకొచ్చింది. ఒక క్యూఆర్ కోడ్‌తో క్షణాల్లో డబ్బు చెల్లించవచ్చు. వినియోగదారుడిపై నేరుగా ఎలాంటి రుసుము లేకపోవడం యూపీఐ విస్తరణకు ప్రధాన కారణాల్లో ఒకటి. అయితే అధిక విలువ కలిగిన కొన్ని వ్యాపార లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించాలన్న నిర్ణయం యూపీఐ ఆర్థిక వ్యవస్థలో ఒక ముఖ్యమైన మార్పును సూచిస్తున్నది. 2026 అక్టోబర్ 15 నుంచి రూ.2,000కు మించిన నిర్దిష్ట వ్యాపార లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్ వర్తించనున్నది. ఇకపై యూపీఐ వాడిన ప్రతిసారీ వినియోగదారుడు రుసుము చెల్లించాల్సి వస్తుందని కాదు. ఒక వ్యక్తి నుంచి మరొక వ్యక్తికి చేసే చెల్లింపులు ఉచితంగానే ఉంటాయి. అలాగే రూ.2,000 వరకు చేసే వ్యాపార చెల్లింపులపైనా ఈ రుసుము ఉండదు. క్యూఆర్ కోడ్ ద్వారా యూపీఐ చెల్లింపులు స్వీకరించే చిన్న వ్యాపారులకు కూడా కొన్ని రక్షణలు కల్పించారు. కేంద్ర ప్రభుత్వ అంచనా ప్రకారం దాదాపు 96 శాతం వ్యాపార లావాదేవీలు ఈ కొత్త రుసుము పరిధిలోకి రావు. ఇక్కడ ఒక విషయాన్ని స్పష్టంగా గుర్తించాలి. ఎండీఆర్ అనేది వినియోగదారుడిపై నేరుగా విధించే పన్ను కాదు. వ్యాపారి డిజిటల్ చెల్లింపును స్వీకరించడానికి చెల్లించే వ్యవస్థాపక రుసుము. ఉదాహరణకు రూ.10,000కు సంబంధించిన లావాదేవీపై 0.4 శాతం రుసుము అంటే రూ.40 అవుతుంది. కొన్ని లావాదేవీలకు గరిష్ఠ పరిమితులు, కొన్ని ముఖ్యమైన రంగాలకు ప్రత్యేక రేట్లు కూడా ఉన్నాయి. ఈ మార్పు వెనుక ఆర్థిక కారణం కూడా ఉన్నది. యూపీఐ వినియోగదారుడికి ఉచితంగా కనిపించినప్పటికీ, దాన్ని నిర్వహించడం మాత్రం ఉచితం కాదు. బ్యాంకులు, చెల్లింపు సంస్థలు సర్వర్లు, సైబర్ భద్రత, మోసాల నివారణ, సమాచార వ్యవస్థల నిర్వహణ, వినియోగదారుల సేవల కోసం నిరంతరం ఖర్చు చేయాలి. 2026 ఆగస్టులోనే యూపీఐ ద్వారా సుమారు రూ.2,400 కోట్ల లావాదేవీలు జరిగాయి. వాటి మొత్తం విలువ దాదాపు రూ.27.7 లక్షల కోట్లు. ఇప్పటివరకు జీరో ఎండీఆర్ విధానాన్ని ప్రభుత్వం వివిధ ప్రోత్సాహకాల ద్వారా కొనసాగించింది. దీని వల్ల చిన్న దుకాణదారుడు కూడా ఎలాంటి లావాదేవీ రుసుము గురించి ఆలోచించకుండా యూపీఐ చెల్లింపులను స్వీకరించగలిగాడు. అయితే యూపీఐ వినియోగం నిరంతరం పెరుగుతున్న నేపథ్యంలో ఈ మొత్తం వ్యవస్థ నిర్వహణ ఖర్చును ప్రభుత్వమే భరించాలా? కొత్త మార్గాలను అన్వేషించడం అవసరమా అనే చర్చ జరుగుతున్నది. యూపీఐ చెల్లింపులపై రుసుము విధించడంపై రాజకీయ వివాదం కూడా ఉన్నది. అమెరికా ఒత్తిడి, అంతర్జాతీయ చెల్లింపు సంస్థల ప్రయోజనాల కారణంగానే ఈ మార్పు తీసుకొచ్చారని ప్రతిపక్షాల నేతలు ఆరోపిస్తున్నారు. వీసా, మాస్టర్ కార్డ్ వంటి అంతర్జాతీయ చెల్లింపు సంస్థలు సాధారణంగా వ్యాపారుల నుంచి రుసుములు వసూలు చేసే విధానంలో పనిచేస్తాయి. దీనికి భిన్నంగా భారతదేశం యూపీఐని దాదాపు జీరో రుసుముతో అభివృద్ధి చేసింది. రాజకీయ వివాదాల సంగతి పక్కనపెడితే అసలు ఆందోళన మాత్రం చిన్న వ్యాపారులపై పడే ప్రభావం. పెద్ద వ్యాపార సంస్థ ఒక చిన్న రుసుమును భరించగలిగినా, తక్కువ లాభాలతో నడిచే చిన్న దుకాణదారుడికి అది భారంగా మారుతుంది. వ్యాపారి ఆ ఖర్చును తన లాభంలో నుంచి భరించవచ్చు, లేక పోటీ పరిస్థితులను బట్టి వస్తువులు, సేవల ధరల్లో పరోక్షంగా సర్దుబాటు చేయవచ్చు. వినియోగదారుడిపై నేరుగా ఈ రుసుమును వేయకూడదని ప్రభుత్వం స్పష్టం చేసినప్పటికీ, ఆ నిబంధన అమలు ఎలా జరుగుతుందన్నది కీలకం. అందువల్ల యూపీఐపై చర్చను 'ఇక నుంచి చెల్లింపులకు రుసుము' అనే సరళమైన ప్రశ్నకు పరిమితం చేయకూడదు. యూపీఐ విజయానికి కారణమైన సరళత, తక్కువ వ్యయం, ప్రజల నమ్మకం దెబ్బతినకుండా, ఈ భారీ డిజిటల్ మౌలిక వ్యవస్థను దీర్ఘకాలం ఆర్థికంగా నిలకడగా ఎలా నిర్వహించాలన్నదే అసలు ప్రశ్న. యూపీఐని కోట్లాది ప్రజలకు అందుబాటులోకి తెచ్చిన నమూనాను కాపాడుతూనే, దాని నిర్వహణ ఖర్చును ఎవరు, ఎంతవరకు భరించాలి? ఈ ప్రశ్నకు సమతుల్యమైన సమాధానమే భవిష్యత్తులో యూపీఐ విజయాన్ని నిర్ణయిస్తుంది.

ఈసీ వివాదం.. ప్రజాస్వామ్య గందరగోళం



ఎన్నికల సంఘం కమిషనర్ల మధ్య భిన్నాభిప్రాయాలు కేవలం అధికార–విపక్షాల మధ్య సాగే రాజకీయ రగడ మాత్రమే కాదు, ఇది రగులుతున్న కాగడా. అది సంస్థాగత చట్టబద్ధతకు, పారదర్శకతకు సంబంధించిన లోతైన ప్రశ్న. భారత ఎన్నికల సంఘం ఈసీఐ) సాధారణ ప్రభుత్వ విభాగం కాదు. ఇది రాజకీయ, ప్రభుత్వ కుట్రల ఎత్తుగడలు, ఏ పనిచేసైనా గెలిచితీరాలి అనే నిరంతర ఎన్నికల దుర్మార్గాలు. రాజ్యాంగం అధికరణ 324 కింద ఏర్పాటైన ఒక స్వతంత్ర రాజ్యాంగ వ్యవస్థ ఈసీ. ఓటరు జాబితా తయారీ నుంచి ఎన్నికల నిర్వహణ వరకు దీని నిర్ణయాలు దేశ ప్రజాస్వామ్య పునాదులను నిర్దేశిస్తాయని పాఠాలు వింటున్నాం. మరోవైపు ఇటీవల ఎన్నికల సంఘం అంతర్గత వ్యవహారాలపై కథనాలు వెలువడుతున్నాయి. సీఈసీ తీరుపై పోరాటాలు, ఆందోళనలు ధర్నాలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పత్రిక వెల్లడించిన అంతర్గత పత్రాల ప్రకారం ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ఐఆర్) ప్రక్రియ తీరుపై 10 నెలల్లో ఇద్దరు ఎన్నికల కమిషనర్లు (సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి) 14 సార్లు కీలక అభ్యంతరాలు వ్యక్తం చేశారని పేర్కొన్నది. అభ్యంతరాల్లో కీలకమైనది, ఫామ్ 6 మార్పు. కొత్త ఓటరు నమోదు కోసం ఉద్దేశించిన 'ఫామ్ 6'లో పౌరులు తమ తల్లిదండ్రులు లేదా తాతముత్తాతల పేర్లు గత జాబితాలో ఉన్నాయా లేదా చెప్పే ఒక డిక్లరేషన్‌ను ఈసీ పొందుపరిచింది. నిబంధనల ప్రకారం చట్టబద్ధమైన ఫామ్‌ను మార్చాలంటే 'రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టర్స్ రూల్స్, 1960'కు సవరణ చేయాలి. అలాంటి సవరణ ఏదీ లేకుండా, కమిషన్ పూర్తి ఆమోదం లేకుండా మార్పులు ఎలా జరిగాయన్నది కీలక ప్రశ్న. 'నమోదు' పేరుతో, 'తొలగింపు' అధికారం ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్' (ఈఆర్‌వో) పరిధిలోనిది. అయితే, కేంద్రీకృత సాఫ్ట్‌వేర్ వ్యవస్థల ద్వారా స్థానిక అధికారుల నిర్ణయాలను తలకిందులు చేస్తున్నారనే ఆరోపణలు వచ్చాయి. చట్టం కల్పించిన అధికారాలను ఒక కంప్యూటర్ కోడ్ లేదా కేంద్ర సర్వర్ అధిగమించకూడదు. ఉదాహరణకు బెంగాల్ అప్పీళ్ల వివాదం. లక్షల సంఖ్యలో ఓటర్ల తొలగింపు, పునరుద్ధరణలకు సంబంధించి ఎన్నికల సంఘం పేరిట దాఖలైన అప్పీళ్లకు చట్టబద్ధమైన ముందస్తు అనుమతి ఎవరిచ్చారనే ప్రశ్నకు సమాధానం కరువైంది. కొంచెం గతం నుంచి తవ్వుకుంటే తప్ప అర్థం కాదు. సంస్థాగత విశ్వసనీయత విషయంలో రాజకీయ పార్టీల వైఖరి ఏ విధంగా మారుతుందో చెప్పేందుకు 2006– 2026 మధ్య కాలంలోని పరిస్థితుల పోలిక అద్దం పడుతుంది. 2006లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ సర్కార్ పాలనలో ఎన్నికల కమిషనర్ నవీన్ చావ్లాను తొలగించాలంటూ బీజేపీ మిత్రపక్షాలకు చెందిన 205 మంది ఎంపీల సంతకాలతో రాష్ట్రపతికి వినతిపత్రం ఇచ్చింది. కాంగ్రెస్‌కు చెందిన ఒక ట్రస్టుతో నవీన్ చావ్లా కుటుంబ సభ్యులకు ఆర్థిక సంబంధాలు ఉన్నాయని తెలిపింది. నాటి ప్రతిపక్ష బీజేపీ నీతులు వేరు. ఇప్పుడు స్వయంగా కమిషనర్లే ఎన్నికల విధానాలు, సాఫ్ట్‌వేర్ మార్పులపై అంతర్గతంగా అభ్యంతరం తెలుపుతున్నారు. నిర్ణయాలు చట్టబద్ధ అధికారాలతో జరుగుతున్నాయా లేదా అనే సంస్థాగత వివాదం నెలకొన్నది. టీఎన్ శేషన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా తీర్పు స్పష్టం చేసినట్టు, ఎన్నికల సంఘంలో మెజారిటీ నిర్ణయాలు చెల్లుతాయి. భిన్నాభిప్రాయాలు ఉండటం సహజం. అయితే ప్రతి నిర్ణయమూ చట్టబద్ధమైన అధికారం ద్వారా జరిగిందా, దానికి సంబంధించిన లిఖితపూర్వక మినిట్స్ ఉన్నాయా అనేదే అసలు ప్రశ్న. రాజకీయ ఆరోపణలు పక్కనపెట్టి, ఎన్నికల సంఘం విశ్వసనీయత నిలబడాలంటే ఐదు ప్రశ్నలకు లిఖితపూర్వక డాక్యుమెంటరీ ఆధారాలతో సమాధానాలు లభించాలి. వివాదాస్పదమైన పరిపాలనా, సాంకేతిక మార్పులకు అసలు అనుమతి ఇచ్చింది ఎవరు? ఏ చట్టం లేదా ఏ నిబంధన ప్రకారం ఆ మార్పులను అమలు చేశారు? పూర్తిస్థాయి త్రిసభ్య కమిషన్ ముందు ఈ ప్రతిపాదనలు ఉంచి చర్చించారా? వ్యతిరేకత వచ్చినప్పుడు చట్టబద్ధమైన మెజారిటీ లేదా ఏకగ్రీవ పద్ధతిని పాటిస్తూ రికార్డు నమోదు చేశారా? సాఫ్ట్‌వేర్ వ్యవస్థలు, సెంట్రల్ డేటాబేస్ ద్వారా స్థానిక ఎన్నికల నమోదు అధికారుల (ఈఆర్‌వో) అధికారాలను అధిగమించారా? అనూప్ బరన్‌వాల్ కేసులో సుప్రీంకోర్టు సూచిం చిన త్రిసభ్య ప్యానెల్ (ప్రధాని, ప్రతిపక్ష నేత, సీజేఐ) స్థానంలో కేంద్రం తెచ్చిన 2023 చట్టం ద్వారా సీజేఐ స్థానంలో కేంద్ర మంత్రి చేరారు. ఇది ఎన్నికల కమిషన్ స్వతంత్రతపై న్యాయపరమైన సందేహాలకు తావిచ్చింది.

గతంలో ఓటర్ల చేర్పులు, తొలగింపులు పూర్తిగా స్థానిక అధికారుల పరిశీలన ఆధారంగా జరిగేవి. నేడు కేంద్రీకృత సాఫ్ట్‌వేర్ ప్లాట్‌ఫామ్‌లు రావడంతో, క్షేత్రస్థాయి పరిశీలనను దాటి కేంద్ర సర్వర్‌లే కీలక నిర్ణయాలను ప్రభావితం చేస్తున్నాయనే సాంకేతిక సవాళ్లు ముందుకు వచ్చాయి. కమిషన్ లోపల జరిగే చర్చలు గతంలో బయటకు వచ్చే వి కావు. అయితే ఇటీవలి దస్త్రాలు బహిర్గతం కావడంతో కమిషనర్ల మధ్య విధానపరమైన అసమ్మతి ఉన్నట్టు వెలుగుచూసింది. పాలక పక్షంలో ఉన్నప్పుడు ఒకలా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరొకలా మాట్లాడటం రాజకీయ విన్యాసమే తప్ప రాజ్యాంగ నైతికత కాదు. ఎన్నికల సంఘం ఏ ఒక్క రాజకీయ కూటమి పక్షానో ఉండటం కాదు, రాజ్యాంగం వైపు నిలబడటమే భారత ప్రజాస్వామ్యానికి రక్ష.

2023 చట్టం వచ్చిన మార్పులు?

సుప్రీంకోర్టు తీర్పు తర్వాత కేంద్రం చీఫ్ ఎలక్షన్ కమిషనర్ అండ్ అదర్ ఎలక్షన్ కమిషనర్స్ యాక్ట్–2023 ఆమోదింపజేసింది. సుప్రీంకోర్టు ఏమంటే ఏమున్నది.. పాలకపక్షానికి మెజారిటీ ఉన్నది. చట్టం ప్రతులను ఎంపీలు చదివినా చదువకపోయినా చట్టం తయారవుతుంది. ప్ర ధాని నామినేట్ చేస్తే కేంద్రమంత్రి సరే అంటా రు. కమిటీలో ప్రతిపక్షనేత ఉన్నా లేకపోయినా, ఆ ఇద్దరి నిర్ణయాన్ని వద్దన్నా అనకపోయినా ని యామకాలు జరిగిపోతాయి. ప్రభుత్వానికి 2:1 నిష్పత్తిలో వీటో స్థాయి అధికారం లభిస్తుంది.

సుప్రీంకోర్టులో తాజా పిటిషన్లు వాదనలు కేంద్రం తీసుకొచ్చిన 2023 చట్టం రాజ్యాంగ మౌలిక స్వరూపానికి, స్వేచ్ఛాయుత–నిష్పాక్షిక ఎన్నికల సూత్రానికి విరుద్ధమని పేర్కొంటూ అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫామ్స్, డాక్టర్ జయ ఠాకూర్ తదితరులు సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్లు దాఖలు చేశారు. ఎంపిక కమిటీ నుంచి సీజేఐని తొలగించి కేంద్ర మంత్రిని చేర్చడం ద్వారా కమిటీలో ప్రభుత్వం సంపూర్ణ ఆధిక్యత సంపాదించిందని, ప్రతిపక్ష నేత ఉనికి కేవలం నామమాత్రపు లాంఛనంగా మారిపోతుందని తెలిపారు. ఎన్నికల సంఘంపై కార్యనిర్వాహక వర్గానికి సంపూర్ణ నియంత్రణ దక్కడం వల్ల రాజ్యాంగ స్వతంత్రత దెబ్బతింటుందని పేర్కొన్నారు.

పిటిషన్లను విచారించిన జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ సతీశ్‌చంద్ర శర్మతో కూడిన ధర్మాసనం భిన్నాభిప్రాయాలతో తీర్పు ఇచ్చింది. ఈసీ స్వతంత్రంగా ఉండటమే కాదు, స్వతంత్రంగా పనిచేస్తున్నట్టు ప్రజలకు కనిపించాలని జస్టిస్ దీపాంకర్ దత్తా స్పష్టంచేశారు. అంపైర్‌ను ఎన్నుకోవడంలో ఒక పక్షానిదే పైచేయి ఉంటే, నిర్ణయాల విశ్వసనీయత దెబ్బతింటుందని తెలిపారు. రాజ్యాంగ సూత్రాలు ఇప్పటికే స్థిరపడ్డాయని, ప్రస్తుత ధర్మాసనమే ఈ చట్టాన్ని సమీక్షించవచ్చని భావించారు. ఇక జస్టిస్ సతీష్ చంద్ర శర్మ తీర్పులో పార్లమెంటు చేసిన చట్టంపై రాజ్యాంగబద్ధమైన లోతైన ప్రశ్నలు ఉన్నందున, దీనిని విస్తృత రాజ్యాంగ ధర్మాసనం తేల్చాల్సి ఉన్నదని అభిప్రాయపడ్డారు.

ప్రస్తుత పరిస్థితి ఏంది?

ద్విసభ్య ధర్మాసనంలో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో, వివాదం మరింత జాప్యం కాకుండా ఉండేందుకు ఇద్దరు న్యాయమూర్తులు ఈ అంశాన్ని తగిన సంఖ్యాబలం కలిగిన ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనానికి నివేదించాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కోరారు. ప్రస్తుతం ఈ చట్టం రాజ్యాంగబద్ధత, పార్లమెంటరీ అధికార పరిమితులు, ఎన్నికల వ్యవస్థ స్వతంత్రతకు సంబంధించిన తుది తీర్పు సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం విచారణపై ఆధారపడి ఉన్నది.

కోట్లాది మంది భారతీయుల విశ్వాసమే నా అతిపెద్ద బలం

25 ఏళ్లుగా నిరంతర ప్రజాసేవ అందిస్తానని అప్పుడు ఊహించలేద ప్రధాని మోదీ అన్నారు. ప్రజా ఆశీర్వాద బలమే తనను ఇంతకాలం నడిపించిందని పేర్కొన్నారు. ప్రజలు అందించిన నిరంతర ఆశీస్సులు, విశ్వాసం వల్లే తాను ఈ స్థాయికి చేరుకున్నానని పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆశీస్సులు అందించిన దేశ ప్రజలందరికీ శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని మోదీ అన్నారు. ప్రజలు, భగవంతుడి ఆశీస్సులతో దేశానికి మరింత సేవ చేస్తానన్నారు. ప్రభుత్వాధినేతగా 25 ఏళ్ల నిరంతర ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ తన రాజకీయ ప్రయాణాన్ని, ప్రజలతో తన అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.

2001లో గుజరాత్ సీఎంగా తొలి అడుగు

2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా తొలిసారి ప్రమాణ స్వీకారం చేసిన రోజులను ప్రధాని మోదీ గుర్తుచేసుకున్నారు. అప్పటివరకు ఎన్నుకోబడిన పదవిలో పనిచేసిన అనుభవం తనకు లేకపోయినా, ప్రజా జీవితంలో కీలక బాధ్యతలు చేపట్టాల్సి వచ్చిందని చెప్పారు. అప్పట్లో 25 ఏళ్ల పాటు ప్రభుత్వాధినేతగా కొనసాగుతానని తాను ఊహించలేదని మోదీ తెలిపారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా వరుసగా పలు పర్యాయాలు పనిచేసిన తర్వాత 2014లో ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుంచి వరుసగా మూడు పర్యాయాలు దేశ ప్రధానిగా కొనసాగుతున్నారు. తన రాజకీయ ప్రస్థానంలో సాధించిన ప్రతి విజయానికి ప్రధాన కారణం ప్రజలేనని స్పష్టం చేశారు. తాను ప్రస్తుతం ఏ స్థాయిలో ఉన్నా, అందులో కోట్లాది భారతీయుల విశ్వాసం కీలక పాత్ర పోషించిందన్నారు. పార్టీ కోసం కష్టపడిన లక్షలాది కార్యకర్తల శ్రమ కూడా తనకు ఎంతో బలాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. ప్రజల నమ్మకాన్ని పాలనకు మార్గదర్శకంగా తీసుకుని ముందుకు సాగినట్లు తెలిపారు.

'ప్రతి అనుభవం ఓ పాఠమే'

25 ఏళ్ల ప్రస్థానాన్ని వెనక్కి తిరిగి చూసుకుంటే తనలో మొదట కలిగే భావన కృతజ్ఞతేనని ప్రధాని అన్నారు. తన



జీవితంలో ఎదురైన ప్రతి వ్యక్తి, ప్రతి సంఘటన ఏదో ఒక విషయాన్ని నేర్పిందని చెప్పారు. తనను గెలిపించినవారు వినయంగా ఉండటం నేర్పారని, ఓటమి లేదా ఎదురుదెబ్బలు తిరిగి నిలబడే శక్తిని ఇచ్చాయని మోదీ పేర్కొన్నారు. శ్రేయోభిలాషులు ప్రోత్సహించగా, విమర్శకులు తనను తాను లోతుగా పరిశీలించుకునే అవకాశం కల్పించారని చెప్పారు. తనకు మద్దతు ఇచ్చినవారు విశ్వాసం శక్తిని తెలియజేస్తే, తనను వ్యతిరేకించినవారు ప్రజాస్వామ్య బలాన్ని అర్థం చేసుకునేలా చేశారని వివరించారు. 25 ఏళ్ల ప్రస్థానం కేవలం గతాన్ని గుర్తుచేసుకునే సందర్భం కాదని ప్రధాని స్పష్టం చేశారు. భవిష్యత్తు కోసం కొత్త సంకల్పాన్ని పునరుద్ఘాటించాల్సిన సమయమని అన్నారు.

'సేవే లక్ష్యంగా స్వయంసేవకులు'

తాను ఎప్పుడూ ఒంటరిగా భావించలేదని మోదీ అన్నారు. దేశ సాంస్కృతిక ఆత్మను కాపాడుతూ, భారత్‌కు సేవ చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్న అనేక మంది స్వయంసేవకులు, కార్యకర్తలు తనకు అండగా ఉన్నారని చెప్పారు. తమను తాము 'దేశ సేవకులు, మానవాళికి సేవ చేసే సేవకులు'గా భావిస్తూ పనిచేస్తున్న ప్రతి స్వయంసేవకుడు, కార్యకర్తకు గౌరవంగా నమస్కరిస్తున్నట్లు తెలిపారు. దేశ సేవలో వారి నిబద్ధతను కొనియాడారు. వేదాల నుంచి స్వామి వివేకానంద వరకు గొప్ప ఆలోచనలను నిరంతరం ఆచరిస్తూ వచ్చిన భారతదేశం తనకు సేవ చేసే శక్తిని అందిస్తోందని ప్రధాని అన్నారు. వేల ఏళ్ల సాంస్కృతిక వారసత్వం ఉన్న దేశానికి సేవ చేసే అవకాశం లభించడం తనకు గర్వకారణమని పేర్కొన్నారు. మానవత్వంపై ప్రపంచానికి విశ్వాసం కల్పించిన భారతదేశానికి సేవ చేస్తున్న సమయంలో తాను ఎప్పుడూ ఒంటరిగా భావించలేదన్నారు.

వికసిత్ భారత్ కోసం లక్ష్యాలు

ఒకప్పుడు మనకు ఉగ్రవాదం పెనుముప్పుగా ఉండేదని, ఇప్పుడు భారత్ అభివృద్ధి దిశగా వేగంగా పరుగులు పెడుతోందని ప్రధాని మోదీ అన్నారు. ఈ వేగాన్ని ఇక ఎవరూ ఆపలేరన్నారు. భారత తయారీ విమానాల గురించి ప్రపంచమంతా మాట్లాడే రోజు త్వరలో వస్తుందన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్‌ను సాధించాలనే లక్ష్యంపై ఎలాంటి సందేహం లేదని మోదీ స్పష్టం చేశారు. ఈ లక్ష్యాన్ని కచ్చితంగా సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రపంచంలోనే అత్యున్నత మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను నిలబెట్టడం. ప్రపంచంలోనే అత్యున్నత మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను నిలబెట్టడం, విభిన్న రంగాలలో దేశాన్ని స్వయంసమృద్ధిగా తీర్చిదిద్దడం, ప్రపంచ ఉత్పాదక రంగానికి భారతదేశాన్ని ప్రధాన కేంద్రంగా మార్చడం. ప్రతిష్టాత్మక ఒలింపిక్ క్రీడలను భారతదేశంలో విజయవంతంగా నిర్వహించడం వంటివి కూడా సాధిస్తామని తెలిపారు. అంతరిక్ష పరిశోధనల్లో సరికొత్త శిఖరాలను అధిరోహించడం కూడా చేస్తామని వివరించారు.

వినాయకుడికి ప్రత్యేక పూజలు

అంతకు ముందు 25 ఏళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా దిల్లీలోని సరోజినీ నగర్‌లో ఉన్న శ్రీ వినాయక మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న తన కుటుంబ సభ్యులందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆ విఘ్నేశ్వరుడిని ప్రార్థించినట్లు మోదీ ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఆ విఘ్నహర్త ఆశీస్సులతో అందరికీ మేలు జరగాలని, దేశం నిరంతర ప్రగతిపథంలో సాగాలని మోదీ ఆకాంక్షించారు.

దిల్లీలో కుప్పకూలిన ఐదంతస్తుల భవనం

దేశ రాజధాని దిల్లీలోని సీమాపురిలో ఐదంతస్తుల భవనం కుప్పకూలిన ఘటనలో ముగ్గురు మృతి చెందారు. మృతుల్లో గర్భిణి, ఒక చిన్నారి ఉండడం స్థానికంగా అందర్నీ కలచివేస్తుంది. మరో ఎనిమిది మంది ఈ ప్రమాదంలో గాయపడ్డారు. పలువురు భవన శిథిలాల కింద చిక్కుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో భవనం పక్కనే ఉన్న ఇళ్లు కూడా దెబ్బతిన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ బృందాలు ఘటనాస్థలంలో సహాయక చర్యలను ముమ్మరం చేశారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిలో కొంతమందిని సురక్షితంగా బయటకు తీశారు. దిల్లీలో నిన్న సంభవించిన భూ ప్రకంపనలు కారణంగానే భవనం కూలి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. కాగా, ఇటీవలే దిల్లీలోని సత్యానికేతన్ ప్రాంతంలో బాలుర పీజీ భవనం కుప్పకూలి ఏడుగురు మృతి చెందిన ఘటన మరువకముందే మరో భవనం కుప్పకూలడం భద్రతా వైఫల్యాలను మరోసారి బట్టబయలు చేసింది.

యూపీ పీసీసీ అధ్యక్షురాలిగా ఆరాధన మిశ్రా



ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ పార్టీ కీలక మార్పులు చేపట్టింది. రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడిగా అజయ్ రాయ్ స్థానంలో బ్రాహ్మణ సామాజికవర్గానికి చెందిన ఆరాధన మిశ్రా మోనాను అధిష్ఠానం నియమించింది. రాష్ట్రంలో చేజారిన బ్రాహ్మణ ఓటు బ్యాంకును తిరిగి దక్కించుకోవడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టమవుతోంది. అయితే, దశాబ్దం క్రితం విఫలమైన పాత వ్యూహాన్నే కాంగ్రెస్ పునరావృతం చేస్తోందన్న విశ్లేషణలు రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. గతంలో 2017 యూపీ అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ కాంగ్రెస్ ఇటువంటి వ్యూహాన్నే అనుసరించింది. అప్పటి ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ సూచన మేరకు, బ్రాహ్మణ సామాజికవర్గానికి చెందిన షీలా దీక్షిత్‌ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా రంగంలోకి దింపింది. రాష్ట్ర జనాభాలో దాదాపు 10 నుంచి 12 శాతం ఉన్న బ్రాహ్మణ ఓటర్లను ప్రసన్నం చేసుకుంటే పార్టీకి పూర్వవైభవం లభిస్తుందని అప్పట్లో అంచనా వేసింది. అయితే, ఆ ప్రయోగం ఆశించిన ఫలితాలను ఇవ్వకపోగా, తీవ్రంగా బెడిసికొట్టడంతో కాంగ్రెస్ కేవలం ఏడు స్థానాలకే పరిమితం కావాల్సి వచ్చింది. ప్రస్తుతం మరోసారి అదే బాటలో పయనిస్తున్న కాంగ్రెస్‌కు, ఈసారి మిత్రపక్షమైన సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) నుంచే సవాళ్లు ఎదురయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ తన 'పీడీఏ' (పిచ్‌డా, దళిత్, అల్పసంఖ్యాక్) నినాదాన్ని మరింత విస్తృతం చేశారు. పీడీఏలోని 'పి' అంటే 'పండిట్' (బ్రాహ్మణులు) అని కూడా అర్థం చెబుతూ ఆ సామాజికవర్గ ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. బీజేపీ ప్రభుత్వం బ్రాహ్మణులను విస్మరిస్తోందని ఆయన నిరంతరం విమర్శలు గుప్పిస్తున్నారు.

ఎన్నికల కమిషనర్ల నియామకాల తీర్పు రీకాల్‌పై పిటిషన్

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), ఎన్నికల కమిషనర్ల (ఈసీ) నియామకానికి సంబంధించిన 2023 చట్టంపై దాఖలైన పిటిషన్ల విషయంలో సుప్రీంకోర్టులో కీలక పరిణామం జరిగింది. ఈ అంశంపై సెప్టెంబర్ 23న వెలువడిన భిన్నమైన తీర్పును వెనక్కి తీసుకోవాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను పరిశీలించేందుకు సర్వోన్నత న్యాయస్థానం అంగీకరించింది. ప్రధాని, లోక్‌సభ విపక్ష నేత, సీజేఐలతో కూడిన కమిటీ చేసే సిఫార్సుపై సీఈసీ, ఈసీల నియామకాలను రాష్ట్రపతి చేస్తారని 2023 మార్చి 2న ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం చరిత్రాత్మక తీర్పు వెలువరించింది. సీజేఐ బదులు కేంద్ర మంత్రికి అవకాశమిస్తూ ఆ ఏడాది డిసెంబరులో పార్లమెంటులో చట్టాన్ని రూపొందించడంతో దాని రాజ్యాంగబద్ధ చెల్లుబాటును పలువురు సవాల్ చేశారు. ఈ పిటిషన్లను విస్తృత రాజ్యాంగ ధర్మాసనానికి అప్పగించాలా? అనే అంశంపై సెప్టెంబర్ 23న జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. అయితే ఈ అంశంపై ఇద్దరు న్యాయమూర్తులు ఏకాభిప్రాయానికి రాలేకపోయారు. ఫలితంగా భిన్నమైన తీర్పులు వెలువడ్డాయి.

భిన్న తీర్పులు

ఈ కేసును మరింత విస్తృతమైన రాజ్యాంగ ధర్మాసనానికి బదిలీ చేయాలని కేంద్రం కోరింది. అయితే జస్టిస్ దీపాంకర్ దత్తా ఈ అభ్యర్థనను తిరస్కరించారు. ఎంపిక కమిటీలో ఒక క్యాబినెట్ మంత్రిని చేర్చడం వల్ల దాని తటస్థ స్వరూపం పోతుంది. 2023 చట్టం కార్యనిర్వాహక వర్గానికి ఎక్కువ అధికారాన్ని కట్టబెడుతుందని అభిప్రాయపడ్డారు. విపక్ష నేత ఉనికి నామమాత్రం అవుతుందని, కమిటీలో ఆయనను చేర్చిన ఉద్దేశం అలంకారప్రాయంగా మిగిలిపోతుందని పేర్కొన్నారు. కానీ, జస్టిస్ దత్తా వ్యాఖ్యను వ్యతిరేకిస్తూ, కేంద్ర వాదనను జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ మాత్రం ఏకీభవించారు. ఆర్టికల్ 145(3) ప్రకారం ఈ అంశాన్ని రాజ్యాంగ ధర్మాసనం అధికారికంగా నిర్ణయించాల్సి ఉంటుందని తెలిపారు. దీనిపై



విస్తృత ధర్మాసనం పరిశీలించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. దీంతో తదుపరి చర్యల కోసం ఈ అంశాన్ని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ వద్దకు పరిపాలనా పరంగా పంపాలని ద్విసభ్య ధర్మాసనం నిర్ణయించింది. తగిన సంఖ్యలో న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనాన్ని ఏర్పాటు చేసి, అంశంపై సమర్థవంతమైన, తుది నిర్ణయం తీసుకునేలా చేయాలని సూచించింది.

తీర్పు వెనక్కి తీసుకోవాలంటూ పిటిషన్

ఈ పరిణామాల నేపథ్యంలో భిన్నమైన తీర్పును రీకాల్ చేయాలని కోరుతూ ప్రత్యేక పిటిషన్ దాఖలైంది. సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ బుధవారం ఈ విషయాన్ని ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి.మోహనతో కూడిన ధర్మాసనం ముందు ఈ అంశాన్ని ప్రస్తావించారు. పిటిషన్‌ను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామని సీజేఐ తెలిపారు. తమ పిటిషన్?కు సంబంధించిన వివరాలను ధర్మాసనానికి న్యాయవాది గోపాల్ వివరించారు. తొలుత ఈ రీకాల్ పిటిషన్?ను జస్టిస్ దీపాంకర్ దత్తా నేతృత్వంలోని ధర్మాసనం ముందు ప్రస్తావించినట్లు చెప్పారు. అయితే అనంతరం ఆ ధర్మాసనం నుంచి కేసును తప్పించారని, ప్రధాన న్యాయమూర్తి ముందు ఈ విషయాన్ని ప్రస్తావించాలని సూచించినట్లు తెలిపారు. ఈ వ్యవహారంలో ఇప్పటికే క్యూరేటివ్ పిటిషన్ కూడా దాఖలైందని ఆయన కోర్టుకు వెల్లడించారు. అయితే క్యూరేటివ్ పిటిషన్‌కు, ప్రస్తుతం దాఖలు చేసిన రీకాల్ పిటిషన్‌కు తేడా ఉందని స్పష్టం చేశారు. క్యూరేటివ్ పిటిషన్ తనదైన న్యాయపరమైన ప్రక్రియలో ముందుకు వెళ్లాల్సి ఉంటుందని, ప్రస్తుత దరఖాస్తు మాత్రం సెప్టెంబర్ 23న వెలువడిన తీర్పును వెనక్కి తీసుకోవాలని కోరుతోందని వివరించారు.

ఎంపీలను కొడతారా.. ఇక్కడి నుంచి కదిలేదే లేదు'



భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా దిల్లీలో ఇండియా కూటమి ఎంపీలు చేపట్టిన ఆందోళన ఉద్రిక్తంగా మారింది. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో తీవ్ర అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ జంతర్ మంతర్‌కు ర్యాలీగా వెళ్తున్న ప్రతిపక్ష పార్టీల ఎంపీలను దిల్లీ పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలోనే పలువురు ఎంపీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇదే సమయంలో పోలీసులు తమను ముందుకు వెళ్లకుండా అడ్డుకోవడంతో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా రోడ్డు మీదే నేలపై పడుకొని నిరసన వ్యక్తం చేశారు. తనను అక్కడి నుంచి లేపేందుకు ప్రయత్నించగా, మహిళా పోలీసులు తనపై దాడి చేశారని, తన శరీరమంతా గోళ్లతో గాయపరిచారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసీని కలవాలని వెళ్తుంటే ఎంపీలను కొడతారా? అని ప్రశ్నించారు. 'నేను ఇక్కడి నుంచి కదిలేది లేదు. కేవలం ఎన్నికల సంఘాన్ని కలవాలనుకున్న ఎంపీలతో వారు ప్రవర్తించే తీరు ఇదేనా? ఈ విధంగా ఎంపీలను కొడతారా? మహిళా పోలీసులు నన్ను గోళ్లతో గాయపరిచి కిందికి తోసేశారు. వారి బలగాలను వెనక్కి పిలవమనండి' అని ప్రియాంక గాంధీ వాద్రా ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పోలీసులు జంతర్ మంతర్ సమీపంలోని ఆందోళన స్థలం నుంచి ప్రియాంక గాంధీని బలవంతంగా తరలించారు.

రాహుల్ సహా పలువురు ఎంపీలు అదుపులోకి

మరోవైపు లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీ సహా పలువురు ఎంపీలను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సుమారు రెండు గంటల పాటు అదుపులో ఉంచుకుని ఆ తర్వాత విడుదల చేశారు. జంతర్ మంతర్‌కు చేరుకునే క్రమంలో భద్రతా బలగాలు భారీగా మోహరించాయి. ఎంపీలు ప్రయాణిస్తున్న బస్సులను కూడా నిరసన ప్రదేశానికి కొంత దూరంలోనే నిలిపివేశారు. ఈ క్రమంలోనే కొందరు కాంగ్రెస్ ఎంపీలు బస్సులపైకి ఎక్కి నినాదాలు చేశారు.

ఎన్ని కేసులు పెట్టినా పోరాటం ఆగదు: మల్లికార్జున ఖర్గేమంగళవారం ఆకాశవాణి భవన్ ప్రాంగణంలోకి అనుమతి లేకుండానే ప్రవేశించారనే ఆరోపణలపై రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఇతర ఎంపీలపై దిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. దీనిపై స్పందించిన కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభ్య ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే కేంద్రంపై తీవ్ర విమర్శలు చేశారు. తమపై ఎన్ని కేసులు పెట్టినా తమ పోరాటం కొనసాగుతుందని అన్నారు. 'మాపై ఎన్ని కేసులు పెట్టినా, ఎంతలా బెదిరించాలని చూసినా మేం భయపడేది లేదు. నవ్వుతూనే ముందుకెళ్తాం. ప్రజల హక్కుల కోసం మా పోరాటం కొనసాగుతుంది' అని కాంగ్రెస్ అధ్యక్షుడు ఎక్స్ వేదికగా స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఎంపీ చరణ్‌జిత్ సింగ్ చన్నీ కూడా కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము ఎన్నికల సంఘం కార్యాలయం వైపు వెళ్లాలనుకుంటున్నా పోలీసులు ఎందుకు అడ్డుకుంటున్నారని, వారు గూండాయిజానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. దేశంలో ప్రజాస్వామ్యం లేకుండా పోతోందని మండిపడ్డారు. ఇదే అంశంపై స్పందించిన మరో కాంగ్రెస్ ఎంపీ పవన్ ఖేరా– శాంతియుతంగా నిరసన వ్యక్తం చేయడం తమ ప్రజాస్వామ్య హక్కు అని తెలిపారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 ని ప్రస్తావిస్తూ జంతర్ మంతర్ నిరసన ప్రదేశమైనప్పుడు అక్కడికి కూడా ఎంపీలను అనుమతించకపోతే ఎక్కడ ఆందోళన చేయాలని ప్రశ్నించారు. ఇక సీఈసీ జ్ఞానేశ్ కుమార్ సహా కేంద్ర ప్రభుత్వంపైనా తమ పోరాటం కొనసాగుతుందని ఆర్జేడీ ఎంపీ మనోజ్ కుమార్ ఝా వ్యాఖ్యానించారు. వరుసగా రెండో రోజు ప్రతిపక్షాల ఆందోళనసర్ ప్రక్రియపై ప్రతిపక్షాల ఆందోళన వరుసగా రెండో రోజు కొనసాగింది. మంగళవారం రోజు పార్లమెంట్ నుంచి ఎన్నికల సంఘం కార్యాలయం వైపు వెళ్లిన ఇండియా కూటమి ఎంపీలను పోలీసులు అడ్డుకున్నారు. తర్వాత రాహుల్, ప్రియాంక గాంధీ సహా కొందరు ఆకాశవాణి భవన్ ప్రాంగణంలో నిరసన కొనసాగించారు. దాదాపు 9 గంటల పాటు ఆందోళన తర్వాత పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. ఇక బుధవారం మధ్యాహ్నం ఖర్గే నేతృత్వంలో ఇండియా కూటమి ఎంపీలు సమావేశంపై తదుపరి కార్యాచరణపై చర్చించారు. అనంతరం జంతర్ మంతర్‌వైపు ర్యాలీగా బయల్దేరారు. ఈ నేపథ్యంలోనే దిల్లీలోని జంతర్ మంతర్ పరిసరాల్లో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. ఇక్కడ సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలనేది వారి ప్రధాన డిమాండ్‌గా ఉంది.

ఎల్‌కే అడ్వాణీని కలిసిన ప్రధాని మోదీ

బీజేపీ సీనియర్ నాయకుడు ఎల్‌కే అడ్వాణీని ఆయన నివాసంలో ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం కలిశారు. ప్రభుత్వాధినేతగా 25ఏళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో అడ్వాణీకి మోదీ కలిసినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా అడ్వాణీ ఆరోగ్య విషయాలను పీఎం మోదీ అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు సోషల్ మీడియా ఎక్స్?లో ఓ పోస్టు షేర్ చేశారు. 'అడ్వాణీజీని ఆయన నివాసంలో కలిసి, వారి ఆశీస్సులు తీసుకున్నాను. దశాబ్దాల తరబడి ఆయన అందించిన ప్రజా సేవ, జాతీయ జీవనంలో ఆయన చేసిన కృషి చెరగని ముద్ర వేశాయి. భారతదేశ పురోగతిని బలోపేతం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారు' అని పేర్కొంటూ అడ్వాణీతో దిగిన తాజా ఫొటోను మోదీ షేర్ చేసుకున్నారు. కాగా, పీఎం మోదీ ప్రభుత్వాధినేతగా నేటితో 25ఏళ్లు పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా బీజేబీ శ్రేణులు సేవా సంకల్ప్ అభియాన్ పేరిట కార్యక్రమాలు నిర్వహించాయి. అంతకుముందు బుధవారం ఉదయాన్ని దిల్లీలోని శ్రీ వినాయక మందిరంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేక పూజలు చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న తన కుటుంబ సభ్యులందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆ విఘ్నేశ్వరుడిని ప్రార్థించినట్లు మోదీ ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఆ విఘ్నహర్త ఆశీస్సులతో అందరికీ మేలు జరగాలని, దేశం నిరంతర ప్రగతిపథంలో సాగాలని మోదీ ఆకాంక్షించారు.అనంతరం దిల్లీలో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప్ సభలో ప్రధాని మోదీ పాల్గొన్నారు.



ఈ సందర్భంగా తన 25ఏళ్ల పాలనా ప్రస్థానాన్ని మోదీ గుర్తుచేసుకున్నారు. 2001 అక్టోబర్ 7న గుజరాత్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసినప్పుడు ఈ స్థాయికి వస్తానని తానెప్పుడూ ఊహించలేదని అన్నారు. పని చేయడమే తన ధర్మమని, దేశం కోసం నిరంతరం శ్రమిస్తూనే ఉంటానని స్పష్టం చేశారు. దేశాభివృద్ధికి ఓటు బ్యాంకు రాజకీయాలు, కులాల వారీగా సమాజాన్ని విభజించడం అతిపెద్ద అవరోధాలని మోదీ హెచ్చరించారు.

ప్రపంచం చూపు భారత్ వైపు

ప్రస్తుతం ప్రపంచమంతా భారత్ వైపే చూస్తోందని అన్ని రంగాల్లో ఆవిష్కరణలతో కొత్త చరిత్ర లిఖించడానికి ఇదే సరైన సమయమని మోదీ పేర్కొన్నారు. ఒకప్పుడు ఉగ్రవాదం పెనుముప్పుగా ఉండేదని ఇప్పుడు భారత్ అభివృద్ధి దిశగా వేగంగా పరుగులు పెడుతోందన్నారు. ఈ వేగాన్ని ఎవరూ ఆపలేరన్నారు. భారత తయారీ విమానాల గురించి ప్రపంచమంతా మాట్లాడే రోజు త్వరలో వస్తుందన్నారు. ప్రత్యర్థుల విమర్శలే తనను లోతుగా ఆలోచించేలా చేసి బలోపేతం చేశాయని అన్నారు.

విజయవాడ ఉత్సవ్‌కు మంత్రులకు ఆహ్వానం

విజయవాడ సంస్కృతి, ఆధ్యాత్మిక వైభవాన్ని చాటేలా మహోత్సవాలు

రాష్ట్ర మంత్రులను ఆహ్వానించిన ఎంపీ కేశినేని చిన్ని





విజయవాడ, మహానగర్

నగర సంస్కృతి, ఆధ్యాత్మిక వైభవం, కళలు, సంప్రదాయాలకు ప్రతీకగా నిర్వహిస్తున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు, విజయవాడ ఉత్సవ్‌--2.0కు హాజరు కావాలని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) పలువురు రాష్ట్ర మంత్రులను ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్, మంత్రి కొలుసు పార్థసారథిలను కలిసి ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను అందజేశారు. విజయవాడ కనకదుర్గమ్మవారి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు కలిగిన ఆధ్యాత్మిక వేడుకలని, అదే స్ఫూర్తితో నగర సంస్కృతి, కళలు, సంప్రదాయాలు, పర్యాటక విశిష్టతలను ప్రపంచానికి చాటిచెప్పేలా విజయవాడ ఉత్సవ్‌--2.0ను ఘనంగా నిర్వహిస్తున్నామని ఎంపీ తెలిపారు. గత ఏడాది విజయవాడ ఉత్సవ్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని, ఈ ఏడాది మరింత భారీ స్థాయిలో ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు, విజయవాడ ఉత్సవ్‌--2.0లో రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు, నగర ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవాడ సాంస్కృతిక వైభవాన్ని చాటాలని కోరారు. విజయవాడ ఉత్సవ్ ప్రతి విజయవాడ వాసి ఉత్సవమని, నగర ప్రజలందరూ ఈ మహోత్సవంలో భాగస్వాములు కావాలని ఎంపీ కేశినేని చిన్ని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కల్చరల్ కార్పొరేషన్ చైర్మన్ పొడపాటి తేజస్వి పాల్గొన్నారు.

అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు కావాలి

ఎ.ఎస్.డి.డి జాబితాపై మరోసారి ఇంటింటి పరిశీలన : జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ

అందుబాటులో లేని, వేరే ప్రాంతాలకు తరలిపోయిన, మరణించిన, డూప్లికేట్ ఓటర్లపై ప్రత్యేక పరిశీలన

విజయవాడ, మహానగర్

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ--2026లో భాగంగా ఎ.ఎస్.డి.డి (అందుబాటులో లేని, వేరే ప్రాంతాలకు తరలిపోయిన, మరణించిన, ఒకటి కంటే ఎక్కువసార్లు నమోదైన) జాబితాపై మరోసారి ఇంటింటి పరిశీలన చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. జూన్ 15 నుంచి జూలై 24 వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటి సందర్శన నిర్వహించగా జిల్లాలో 1,23,714 మంది ఓటర్లు ఎ.ఎస్.డి.డి జాబితాలో ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. జూలై 31న ప్రచురించిన ముసాయిదా ఓటర్ల జాబితాలో జిల్లాలో 15,89,731 మంది ఓటర్లు నమోదయ్యారని, అక్టోబర్ 6 వరకు నిర్వహించిన నోటీసుల ప్రక్రియలో మరో 12,786 మందిని అనర్హులుగా గుర్తించినట్లు తెలిపారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకుని అక్టోబర్ 16న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నట్లు వెల్లడించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అర్హత కలిగిన ఒక్క



వ్యక్తి కూడా ఓటరుగా నమోదు కాకుండా మిగిలిపోకూడనే ఉద్దేశంతో అక్టోబర్ 8 నుంచి ఎ.ఎస్.డి.డి జాబితాలో తొలగించబడిన పేర్లపై బూత్ స్థాయి అధికారులు మరోసారి ఇంటింటి పరిశీలన చేపడతారని చెప్పారు. పొరపాటున ఓటర్ల జాబితా నుంచి పేరు తొలగించబడినట్లు తేలితే వెంటనే ఫారం--6 ద్వారా దరఖాస్తు స్వీకరించి, నిరంతర ఓటర్ల జాబితా నవీకరణ ప్రక్రియలో భాగంగా ఓటు హక్కు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి సంవత్సరం జనవరి 1, ఏప్రిల్ 1, జూలై 1, అక్టోబర్ 1 తేదీలను అర్హత తేదీలుగా పరిగణిస్తూ ఓటర్ల జాబితా నిరంతర నవీకరణ జరుగుతుందని వివరించారు. తుది జాబితాలో పేరు లేని అర్హులైన పౌరులు సంబంధిత పత్రాలతో ఫారం--6 ద్వారా దరఖాస్తు చేసుకుని ఓటరుగా నమోదు చేసుకోవాలని, అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదై తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ డా. జి. లక్ష్మీశ కోరారు.

పతకం ఒక్కటే కాదు.. పీ4 స్ఫూర్తికి ఘన విజయం

- ఫలించిన జిల్లా కలెక్టర్ చొరవ.. కృపారావు బంగారు విజయం



విజయవాడ, మహానగర్

కెనడాలో ఇటీవల జరిగిన కామన్వెల్త్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో జి.కొండూరు మండలం, వెంకటాపురం గ్రామానికి చెందిన క్రీడాకారుడు సంకు కృపారావు బంగారు పతకం సాధించి ఎన్టీఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి గుర్తింపు తెచ్చారు. ఈ విజయం వెనుక ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమం పీ4 స్ఫూర్తి పథం కూడా ఉంది. క్రీడాకారున్ని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ బుధవారం కలెక్టరేట్‌లో అభినందించారు. మరిన్ని విజయాలు సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు. అంతర్జాతీయ స్థాయి పోటీలో పాల్గొనేందుకు అవసరమైన ఆర్థిక సహాయం కోసం జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశను ఇటీవల కృపారావు కుటుంబ సభ్యులు ఆశ్రయించారు. ప్రతిభకు ఆర్థిక పరిస్థితులు అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతో కలెక్టర్ లక్ష్మీశ వెంటనే స్పందించి.. పీ4 ద్వారా సహకారం అందేలా చొరవచూపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న పీ4 కార్యక్రమం ద్వారా మార్గదర్శిగా ముందుకు వచ్చిన సెంటిని బయో ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను క్రీడాకారుడికి సహాయం అందించేలా అనుసంధానించి.. రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని అందించారు. ఇప్పటికే వివిధ జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన కృపారావు కెనడాలో ఇటీవల జరిగిన కామన్వెల్త్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించారు. అంతేకాకుండా ఛాంపియన్ ఆఫ్ ది ఛాంపియన్‌గా నిలిచారు. ఆయన సంకల్పం సాకారం కావాలని, ఆయన విజయంతో ఎన్టీఆర్ జిల్లా పేరు అంతర్జాతీయ క్రీడా వేదికపై మార్మోగాలని కలెక్టర్ లక్ష్మీశ గతంలో ఆకాంక్షించగా అది నేడు నిజమైంది.

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

కూటమి నాయకులంతా సమన్వయంతో పనిచేయాలి

రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి



నూజివీడు, మహానగర్:

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి పిలుపునిచ్చారు. పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జిలు, కూటమి నాయకులతో స్థానిక ఎన్నికలపై బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీ, మున్సిపాలిటీ ఎన్నికల్లో కూటమి నాయకులు సమష్టిగా పనిచేసి నూటికి నూరు శాతం విజయాన్ని లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ తల్లికి వందనం, ఉచిత గ్యాస్, పింఛన్లు, అన్నదాత సుఖీభవ, ఉచిత బస్సు ప్రయాణం, పేదలకు ఇళ్ల వంటి పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో రహదారులు దెబ్బతిన్నాయని విమర్శించిన ఆయన, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వేల కిలోమీటర్ల రహదారులను అభివృద్ధి చేసిందన్నారు. మెగా డీఎస్సీ ద్వారా సుమారు 16 వేల ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగాలు కల్పించామని, రాష్ట్రానికి భారీ పెట్టుబడులు తీసుకురావడం ద్వారా ఉద్యోగ అవకాశాలు పెరుగుతున్నాయని చెప్పారు. ఎన్నికల పరిశీలకురాలు, ప్రభుత్వ చీఫ్ విప్ పి. అనురాధ మాట్లాడుతూ స్థానిక ఎన్నికలు సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయానికి పునాదిగా నిలుస్తాయని, మూడు పార్టీల నాయకులు సీట్ల కేటాయింపులకు అతీతంగా సమష్టిగా పనిచేయాలని సూచించారు. ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ టీడీపీ బీసీల అభివృద్ధికి కట్టుబడి ఉందని, స్థానిక ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని తెలిపారు. కూటమి అభ్యర్థులను గెలిపించేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు అన్నదమ్ముల్లా కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏపీ అగ్రి మిషన్ వైస్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

మూడు ప్రధాన ఉత్సవాలకు ఘనంగా సన్నాహాలు

ఎంతమంది వచ్చినా ఎక్కడా ఇబ్బంది లేకుండా సౌకర్యాలు

అధికారులు ప్రణాళికాయుత సమన్వయంతో పనిచేయాలి

ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



విజయవాడ, మహానగర్

నగరానికి ప్రత్యేకమైన దసరా శరన్నవరాత్రి ఉత్సవాలతో పాటు సరస్ అజీవిక మేళా, విజయవాడ ఉత్సవ్--2.0 కూడా ఒకేసమయంలో జరగనున్న నేపథ్యంలో సమన్వయ శాఖల అధికారులు పటిష్ట సమన్వయంతో పనిచేయాలని.. ఉత్సవాలను విజయవంతం చేయడంలో కీలక భాగస్వాములు కావాలని ఎంపీ కేశినేని శివనాథ్, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. బుధవారం కలెక్టరేట్ ఏవీఎస్ రెడ్డి హాల్‌లో ఎంపీ కేశినేని శివనాథ్, జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ అధికారులతో సమావేశ మయ్యారు. ఉత్సవాలకు చేస్తున్న ఏర్పాట్లపై చర్చించారు. ఈసారి వివిధ రాష్ట్రాల నుంచి కూడా ప్రముఖులు హాజరుకానున్నారని.. అదే సమయంలో సామాన్య భక్తులు, సందర్శకులకు పెద్దపీట వేస్తూ చేస్తున్న ఏర్పాట్లపై సమీక్షించారు. ఇంకా ఏవైనా పనులు మిగిలియుంటే యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. దసరా ఉత్సవాలు ప్రశాంతంగా, విజయవంతంగా జరిగేలా ప్రతి శాఖకు కేటాయించిన బాధ్యతలను ముందస్తు ప్రణాళికలకు అనుగుణంగా నిర్వర్తించాలని సూచించారు. భక్తులకు సంతృప్తికరమైన దర్శన అనుభవం కల్పించడంతో పాటు వారికి నగర పర్యటన ప్రత్యేక ఉత్సవాల ద్వారా మధురానుభూతులను మిగిల్చేలా చూడాలన్నారు. సరస్ మేళాలో దేశం నలుమూలల నుంచి స్వయం సహాయక సంఘాల మహిళల ఉత్పత్తులతో దాదాపు 650 స్టాళ్లను ఏర్పాటు చేయడం జరుగుతోందని.. అదే విధంగా వినూత్న కార్యక్రమాలతో విజయవాడ ఉత్సవ్ వేదిక కానుందన్నారు. ప్రముఖుల పర్యటనలు, వేదికల ఏర్పాటు, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రత్యేక పోటీలు, ఫుడ్ ఫెస్టివల్స్, క్రీడాపోటీలు తదితరాలపైనా సమావేశంలో చర్చించి.. ప్రజల భాగస్వామ్యంతో ఉత్సవాల నిర్వహణను విజయవంతం చేయడంపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ఆర్‌డీవో వెన్నెల శ్రీను, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఏఎన్‌వీ నాంచారరావు తదితరులు పాల్గొన్నారు.

ఆహార సేవకు అనుమతి తప్పనిసరి

- జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ

విజయవాడ, మహానగర్



ఇంద్రకీలాద్రి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు లక్షలాదిగా తరలివచ్చే భక్తుల కోసం ప్రభుత్వం పటిష్ట ఏర్పాట్లు చేస్తోందని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. దసరా సందర్భంగా స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తులు భక్తులకు బిస్కెట్లు, ఇతర ఆహార పదార్థాలు పంపిణీ చేసేందుకు ముందుకొస్తున్నారని, అయితే భక్తుల ఆరోగ్యం, భద్రతను దృష్టిలో ఉంచుకుని ఇలాంటి సేవా కార్యక్రమాలను అధికారుల ధ్రువీకరణ అనంతరం నిర్వహించాలని సూచించారు. భక్తులకు ఆహార సేవ చేయాలనుకునే దాతలు ముందుగా కలెక్టరేట్‌లోని 91549 70454 నంబరును సంప్రదించి నమోదు చేసుకోవాలని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో కలెక్టర్ కోరారు. స్వచ్ఛందంగా సేవలందించేందుకు ముందుకొచ్చే వారికి అధికారులు తగిన మార్గదర్శకత్వం అందించడంతో పాటు, అవసరమైన భక్తులకు ఆహార పదార్థాలు చేరేలా సమన్వయం చేసి సహాయ సహకారాలు అందిస్తారని తెలిపారు. అమ్మవారి సేవలో భక్తులు నిమగ్నమై ఉంటే, భక్తులకు సేవలందిస్తున్న అధికార యంత్రాంగానికి సహకరిస్తూ దసరా మహోత్సవాలను విజయవంతంగా నిర్వహించడంలో స్వచ్ఛంద సంస్థలు, దాతలు కీలక భాగస్వాములు కావాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు.

బాలల స్నేహపూర్వక జిల్లాగా ఎన్టీఆర్ జిల్లా

చిన్నారుల హక్కులకు రక్షణ, భవిష్యత్తుకు భరోసా

విద్య, ఆరోగ్యం, పోషణతో పాటు భద్రతకు ప్రాధాన్యం

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు వెంకట పద్మలత

జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశతో కలిసి అధికారులతో భేటీ



విజయవాడ, మహానగర్

బాలల హక్కులను పరిరక్షిస్తూ వారికి సురక్షితమైన, ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పిస్తూ జిల్లాను బాలల స్నేహపూర్వకంగా తీర్చిదిద్దేందుకు సమన్వయంతో చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు వెంకట పద్మలత, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు కె.జి.వెంకట పద్మలత బుధవారం నగరంలో పర్యటించారు. పలు విద్యా సంస్థలు, అంగన్వాడీ కేంద్రాలు, బాలల సంరక్షణ కేంద్రాలను సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. నలంద విద్యానికేతన్ సిబ్బందితో మాట్లాడి ప్రతి తరగతిగదిలో చైల్డ్ హెల్ప్ లైన్ నంబరు, సలహాల పెట్టె ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. తరువాత ప్రజాశక్తినగర్‌లోని అంగన్వాడీ కేంద్రాన్ని, సీవీఆర్ మున్సిపల్ హైస్కూల్‌ను సందర్శించారు. విద్యార్థులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశతో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో బాలల భిక్షాటనను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం బాలల కోసం ప్రత్యేక వాహనం ఏర్పాటు చేయాలని, గ్రామ, వార్డు స్థాయిలో బాల్య వివాహాల పర్యవేక్షణ కమిటీలను మరింత బలోపేతం చేయాలన్నారు. బాలల హక్కుల పరిరక్షణ, భద్రత, సంక్షేమానికి జిల్లా యంత్రాంగం తరపున అవసరమైన అన్ని సదుపాయాలు, సహకారం అందిస్తామని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. సమావేశంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమం, సాధికారత అధికారి షేక్ రుక్సానా సుల్తానా బేగం తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ యువతకు నైపుణ్యాలు.. ఉపాధే లక్ష్యం

విజయవాడలో దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ సదస్సు

నాణ్యతతో కూడిన శిక్షణతోనే మెరుగైన అవకాశాలు

సాంకేతికతతో పర్యవేక్షణ ద్వారా శిక్షణా తరగతులు



విజయవాడ, మహానగర్

గ్రామీణ ప్రాంతాల్లోని యువతకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ అందించి, ఆ శిక్షణను స్థిరమైన ఉపాధి అవకాశాలతో అనుసంధానం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ తెలుగు వ్యవహారాల సలహాదారు, ఆంధ్రప్రదేశ్ నాన్-రెసిడెంట్ తెలుగు సొసైటీ అధ్యక్షుడు డా. రవి కుమార్ పి. వేమూరి అన్నారు. శిక్షణ కార్యక్రమాలు కేవలం ధ్రువపత్రాలకే పరిమితం కాకుండా యువతకు ఉద్యోగం, ఆదాయం, మెరుగైన జీవనోపాధికి ఉపయోగపడాలని పేర్కొన్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, శిక్షణ శాఖకు చెందిన ఉపాధి కల్పన, పారిశ్రామిక అభివృద్ధి సంస్థ సహకారంతో నగరంలో బుధవారం దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు తమిళనాడు, కేరళ, తెలంగాణ, కర్ణాటక, ఒడిశా, పుదుచ్చేరి, అండమాన్--నికోబార్ దీవుల నుంచి అధికారులు, శిక్షణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ముఖ్య లెక్కల నియంత్రణాధికారి అఖిలేష్ ఝా మాట్లాడుతూ, గ్రామీణ యువతకు నాణ్యమైన శిక్షణ, సరైన మూల్యాంకనం, ఉద్యోగ అవకాశాల ధ్రువీకరణ, ఉద్యోగం పొందిన తర్వాత వారి పరిస్థితిని పర్యవేక్షించడం చాలా ముఖ్యమని అన్నారు. మార్గదర్శకాలు, ప్రమాణాలకు అనుగుణంగా కార్యక్రమాలను అమలు చేయాలని సూచించారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, శిక్షణ సంచాలకుడు జి. గణేష్ కుమార్ మాట్లాడుతూ, శిక్షణ, ఉపాధి కార్యక్రమాల అమలులో సంస్థల మధ్య సమన్వయం, సాంకేతిక పరిజ్ఞానం, క్షేత్రస్థాయి పర్యవేక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి పాలడుగు నారాయణస్వామి మాట్లాడుతూ, శిక్షణా కేంద్రాల సీసీ కెమెరాలను నియంత్రణ కేంద్రానికి అనుసంధానం చేయడం, వీడియో సమావేశాల ద్వారా శిక్షణార్థులతో నేరుగా మాట్లాడటం, ఉద్యోగ నియామకాల ధ్రువీకరణకు మూడు దశల విధానం, యువత నమోదు కోసం ూ= సంకేతాల ఆధారిత విధానాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. శిక్షణార్థుల ఎంపిక, శిక్షణా కేంద్రాల మౌలిక సదుపాయాలు, శిక్షణ, మూల్యాంకనం, ధ్రువీకరణ, ఉద్యోగ కల్పన, ఉద్యోగానంతర పర్యవేక్షణ, నిధుల విడుదల తదితర అంశాలపై సదస్సులో సాంకేతిక చర్చలు జరిగాయి. వివిధ రాష్ట్రాల ప్రతినిధులు తమ అనుభవాలు, ఎదురవుతున్న సమస్యలు, పరిష్కార మార్గాలను పంచుకున్నారు. సంస్థ కార్యనిర్వహణ సంచాలకుడు, రాష్ట్రస్థాయి ప్రాజెక్టు నిర్వాహకులు కూడా పాల్గొన్నారు.

కోలాహలంగా సేవా జ్యోతి యాత్ర





విజయవాడ, మహానగర్

ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా జీవితాన్ని పురస్కరించుకొని 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా పశ్చిమ నియోజకవర్గంలో సేవా జ్యోతి యాత్ర నిర్వహించారు. కొత్తపేట కేబీఎన్ కళాశాల నుంచి భవానిపురంలోని ఎన్డీయే కార్యాలయం వరకు బుధవారం నిర్వహించిన ఈ యాత్రకు బీజేపీ యువమోర్చా జిల్లా అధ్యక్షుడు గోటిక శివకృష్ణారెడ్డి నాయకత్వం వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్, ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, మిజోరాం మాజీ గవర్నర్ కొమరం రాజశేఖర్, టీడీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి బుద్ధా వెంకన్న, బీజేపీ రాష్ట్ర ప్రోటోకాల్ ఇన్‌చార్జి పాతూరి నాగభూషణం, పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ బాజీ, ఎన్టీఆర్ జిల్లా బీజేపీ మైనార్టీ మోర్చా అధ్యక్షుడు సయ్యద్ భాష, యువమోర్చా ఇన్‌చార్జి హరికృష్ణ, యువమోర్చా రాష్ట్ర కార్యదర్శి నాగిరెడ్డి, మాజీ కార్పొరేటర్లు, బీజేపీ నాయకులు, పలు కళాశాలల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రధాని మోదీ సేవా ప్రస్థానాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఈ యాత్రను నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేశారు.

ఈ నెల 9 నుంచి ఫ్లిప్‌కార్ట్ ది బిగ్ బిలియన్ డేస్



విజయవాడ

భారతదేశ స్వదేశీ ఈ-కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్ 13వ ఎడిషన్ ది బిగ్ బిలియన్ డేస్ 2026ను ఈ నెల 9న ప్రారంభించనుంది. ఈ ఫెస్టివ్ సేల్‌లో 15 కోట్లకు పైగా ఉత్పత్తులతో పాటు రికార్డు స్థాయిలో విక్రేతలు, ఎంఎస్ఎంఈలు, హస్తకళాకారులు, నేత కార్మికులు పాల్గొననున్నారు. ప్లస్, బ్లాక్, ఫ్లిప్‌కార్ట్ క్రెడిట్ కార్డ్ సభ్యులకు ఈ నెల 8 నుంచే ఎర్లీ యాక్సెస్ అందుబాటులో ఉంటుంది. ఈ ఏడాది ఫ్యాషన్, మొబైల్స్, ఎలక్ట్రానిక్స్, బ్యూటీ, పర్సనల్ కేర్, పెద్ద గృహోపకరణాలు, పండుగ కానుకలు తదితర విభాగాల్లో విస్తృత ఉత్పత్తుల ఎంపికను అందించనుంది. ఫ్లిప్‌కార్ట్ మినిట్స్ ద్వారా 150కి పైగా నగరాల్లో 1,400కు పైగా కేటగిరీల్లో 77,000కు పైగా ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయి. టీబీటీడీ కోసం ఇ-కార్ట్ అదనంగా 1.4 కోట్ల చదరపు అడుగుల వేర్‌హౌసింగ్ స్థలాన్ని చేర్చడంతో నిల్వ సామర్థ్యం 50 శాతం పెరిగింది. లేహ్, కార్గిల్ సహా పలు ప్రాంతాలకు కొత్త డెలివరీ హబ్‌లు, పిన్‌కోడ్‌లు జోడించారు. ఈ ఫెస్టివ్ సీజన్‌లో 2.5 లక్షలకు పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు సృష్టించినట్లు సంస్థ తెలిపింది.

న్యాయవాదుల రక్షణ, సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

- రాష్ట్ర న్యాయ, మైనారిటీ శాఖల మంత్రి ఎన్ఎండీ ఫరూక్



అమరావతి, మహానగర్

రాష్ట్రంలోని న్యాయవాదుల రక్షణ, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని న్యాయ, మైనారిటీ శాఖల మంత్రి ఎన్ఎండీ ఫరూక్ స్పష్టం చేశారు. వెలగపూడి సచివాలయంలోని తన పేషీ కార్యాలయంలో బుధవారం పశ్చిమ గోదావరి జిల్లా బార్ ఫెడరేషన్, ఒంగోలు బార్ అసోసియేషన్, హిందూ లాయర్స్ ఫోరం, ఇతర న్యాయవాదుల బృందాల ప్రతినిధులు మంత్రిని కలిశారు. న్యాయవాదుల రక్షణ బిల్లు, న్యాయమిత్ర, అడ్వొకేట్ వెల్ఫేర్ ఫండ్, హెల్త్ కార్డులు తదితర పథకాలను అమలు చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ న్యాయవాదుల రక్షణ బిల్లు--2026 (ఏపీ అడ్వకేట్స్ ప్రొటెక్షన్ బిల్--2026) రూపకల్పనకు కూటమి ప్రభుత్వం ఇప్పటికే కార్యాచరణ ప్రారంభించిందన్నారు. ముసాయిదాను వీలైనంత త్వరగా సిద్ధం చేసి, ఆమోదం కోసం మంత్రివర్గ సమావేశం ముందుకు తీసుకువెళ్లేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం న్యాయవాదుల సంక్షేమం, రక్షణకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో మరణించిన 1,173 మంది న్యాయవాదుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.4 లక్షల చొప్పున మొత్తం రూ.46.92 కోట్ల ఆర్థిక సాయం ప్రభుత్వం విడుదల చేసినట్లు మంత్రి ఫరూక్ గుర్తు చేశారు.

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజారోగ్యం, పరిశుభ్రతకు ప్రాధాన్యత

మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి



నూజివీడు, మహానగర్

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజారోగ్యం, పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ మౌలిక వసతుల కల్పనపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మండల పరిధిలోని కొన్నంగుంట గ్రామంలో బుధవారం గ్రామస్తులతో కలిసి డ్రైనేజీ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. గ్రామస్తులను పేరుపేరున పలకరించి, జరుగుతున్న అభివృద్ధి పనులు, పెండింగ్‌లో ఉన్న పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. మురుగునీరు నిలవకుండా, గ్రామస్తులకు ఇబ్బందులు కలగకుండా తగిన వాలుతో డ్రైన్లను శాస్త్రీయంగా నిర్మించాలని సూచించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని, నిబంధనల ప్రకారమే మెటీరియల్ వినియోగించాలని స్పష్టం చేశారు. గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రతి గ్రామంలో రక్షిత మంచినీరు, రోడ్లు, డ్రైనేజీ తదితర మౌలిక సదుపాయాలకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామ నాయకులు, కూటమి నాయకులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

క్రమబద్ధీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

100 శాతం గ్రాస్ శాలరీ చెల్లించాలి

ఏపీ ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు డి. సత్యనారాయణ రెడ్డి



విజయవాడ, మహానగర్

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఏపీ ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు డి. సత్యనారాయణ రెడ్డి, కార్యదర్శి పి. రమేష్ డిమాండ్ చేశారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు, ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగులకు 100 శాతం గ్రాస్ శాలరీ చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వద్ద కాంట్రాక్టు ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ధర్నాకు ఏపీ ఎన్జీవో సంఘం జిల్లా నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా డి. సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖలో కాంట్రాక్టు ఉద్యోగులు ఎన్నో ఏళ్లుగా సేవలందిస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో, సిబ్బంది కొరత ఉన్నప్పటికీ తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారని తెలిపారు. దీర్ఘకాలంగా సేవలందిస్తున్నా ఉద్యోగ భద్రత లేకపోవడం, వేతనాల్లో వ్యత్యాసాలు తదితర సమస్యలు ఎదుర్కొంటుండటం ఆందోళనకరమన్నారు. అర్హత కలిగిన కాంట్రాక్టు ఉద్యోగులందరికీ న్యాయం జరిగేలా క్రమబద్ధీకరణ ప్రక్రియ చేపట్టాలని, వేతనాలు, ఉద్యోగ భద్రత, సేవా ప్రయోజనాలకు సంబంధించిన సమస్యలపై ఉద్యోగ సంఘాలతో ప్రభుత్వం చర్చలు జరపాలని కోరారు. పి. రమేష్ మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ఏపీ ఎన్జీవో సంఘం కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బి. సతీష్ కుమార్, బి.వి. రమణ, మహిళా ఉపాధ్యక్షురాలు సిహెచ్. శివలీల, సిహెచ్. మధుసూదనరావు, మహిళా సంయుక్త కార్యదర్శి శ్రీదేవి, నగర శాఖ అధ్యక్షుడు సిహెచ్. సి.వి.ఆర్. ప్రసాద్, మహిళా సంయుక్త కార్యదర్శి విజయశ్రీ, ఉపాధ్యక్షుడు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లిప్‌కార్ట్ బిగ్ బిలియన్ డేస్‌లో మివి వన్ 5జీ అమ్మకాలు



విజయవాడ

స్వదేశీ కన్స్యూమర్ టెక్నాలజీ బ్రాండ్ మివి తొలిసారిగా రూపొందించిన స్మార్ట్‌ఫోన్ మివి వన్ 5జీ ఫ్లిప్‌కార్ట్ బిగ్ బిలియన్ డేస్‌లో ప్రత్యేక ధరలకు అందుబాటులోకి వచ్చింది. అక్టోబర్ 8 నుంచి ఫ్లిప్‌కార్ట్ ప్లస్, వీఐపీ, బ్లాక్ సభ్యులు, అర్హత కలిగిన కార్డుదారులకు ముందస్తు యాక్సెస్ లభించనుండగా, అక్టోబర్ 9 నుంచి అందరికీ విక్రయాలు ప్రారంభమవుతాయి. 4జీబీ128జీబీ వేరియంట్ రూ.11,999, 6జీబీ 128జీబీ రూ.13,499, 8జీబీ 128జీబీ రూ.14,999 ధరలకు లభిస్తాయి. బ్యాంక్, యూపీఐ ఆఫర్లు ఇందులో కలిసివుంటాయని కంపెనీ తెలిపింది. 4ఎన్ఎం క్వాల్‌కామ్ స్నాప్‌డ్రాగన్ 4 జెన్ 2 5జీ ప్లాట్‌ఫామ్‌తో పనిచేసే ఈ ఫోన్‌లో 6.75 అంగుళాల హెచ్‌డీం 120 హెర్ట్ డిస్‌ప్లే, 50 మెగాపిక్సెల్ డ్యూయల్ కెమెరా, 8 మెగాపిక్సెల్ ఫ్రంట్ కెమెరా ఉన్నాయి. 18 వాట్ల ఫాస్ట్ ఛార్జింగ్‌కు మద్దతుతో 6,000 ఎంఏహెచ్ బ్యాటరీ, స్టాక్ ఆండ్రాయిడ్ 16, ఐపీ64 రక్షణ, సైడ్ ఫింగర్‌ప్రింట్ సెన్సార్, క్లియర్‌టాక్ నాయిస్ రిడక్షన్ టెక్నాలజీ అందుబాటులో ఉన్నాయి.




దశరథ మహారాజుగా అరుణ్ గోవిల్.. 'రామాయణం' నుంచి ఫస్ట్ లుక్!

బాలీవుడ్ దర్శకుడు నితేష్ తివారీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న పౌరాణిక చిత్రం 'రామాయణం' నుంచి తాజాగా మేకర్స్ మరో ఆసక్తికర అప్‌డేట్‌ను విడుదల చేశారు. ఈ చిత్రంలో అయోధ్య రాజు దశరథుడిగా నటిస్తున్న సీనియర్ నటుడు అరుణ్ గోవిల్ పోస్టర్‌ను చిత్ర బృందం సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. గతంలో రామానంద్ సాగర్ తెరకెక్కించిన ఐకానిక్ టీవీ సీరియల్ 'రామాయణ్'లో రాముడి పాత్రలో నటించి దేశవ్యాప్తంగా అపారమైన గుర్తింపు తెచ్చుకున్న అరుణ్ గోవిల్, దశాబ్దాల తర్వాత మళ్లీ అదే రామాయణ కథలోకి రావడం విశేషం. ఒకప్పుడు ఒక తరానికి రాముడిని పరిచయం చేసిన ఆయన, ఇప్పుడు అయోధ్య రాజుగా రామాయణ ప్రపంచంలోకి తిరిగి వస్తున్నారు. దశరథుడిగా అరుణ్ గోవిల్ అంటూ చిత్రబృందం రాసుకొచ్చింది. ఈ పోస్టర్‌లో 68 ఏళ్ల అరుణ్ గోవిల్ రాజసంగా అయోధ్య సింహాసనంపై కూర్చున్నట్లుగా కనిపించారు. ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీతగా నటిస్తుండగా, అరుణ్ గోవిల్ కీలకమైన దశరథ మహారాజు పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమా మొదటి భాగం నవంబర్ 6, 2026న దీపావళి కానుకగా విడుదల కానుండగా, రెండో భాగం 2027 దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానుంది. హిందీ, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషలతో పాటు ఐమ్యాక్స్ ఫార్మాట్‌లోనూ ఈ చిత్రం విడుదల కానుంది.



బేబీ బంప్‌తో సమంత స్టన్నింగ్ లుక్.. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఫొటోలు

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు సోషల్ మీడియాలో మరోసారి హాట్ టాపిక్‌గా మారారు. తాజాగా ఆమె పంచుకున్న గ్లామరస్ ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. ప్రత్యేకమైన ఫ్యాషన్ లుక్‌లో సమంత ఇచ్చిన స్టైలిష్ పోజులు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా బ్లాక్ కేప్-స్టైల్ టాప్, మెరిసే సీక్విన్ స్కర్ట్‌లో ఆమె కనిపించిన తీరు ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. సమంత తాజా ఫోటోషూట్‌లో బ్లాక్ సాటిన్ హై-నెక్ టాప్ ధరించారు. దానికి ఫ్లోర్ లెంగ్త్ కేప్ స్లీవ్స్ జోడించడంతో ఆమె లుక్‌కు మరింత రాయల్ టచ్ వచ్చింది. డార్క్ బ్రాంజ్, బ్లాక్ సీక్విన్ డిజైన్‌తో ఉన్న హై-వెయిస్ట్ స్కర్ట్ ఈ మొత్తం లుక్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సింపుల్‌గా ఉన్నప్పటికీ ఎంతో స్టైలిష్‌గా కనిపించేలా ఈ లుక్‌ను రూపొందించారు. సమంతకు సంబంధించిన స్టైలింగ్, ఆభరణాలు, హెయిర్‌స్టైల్, మేకప్ మొత్తం కలిసి ఫోటోషూట్‌కు మరింత గ్లామర్‌ను తీసుకొచ్చాయి. తాజా ఫొటోల్లో సమంత తనదైన కాన్ఫిడెంట్ స్టైల్‌తో కనిపించారు. ఆమె ఫొటోలు సోషల్ మీడియాలోకి వచ్చిన వెంటనే అభిమానులు పెద్ద ఎత్తున స్పందిస్తున్నారు. సమంత కొత్త లుక్ చాలా అందంగా ఉందంటూ నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. ప్రస్తుతం సమంతకు సంబంధించిన ఈ ఫోటోషూట్ సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. ఆమె ఫ్యాషన్ సెన్స్, స్టైలిష్ లుక్‌పై అభిమానులు ప్రత్యేకంగా కామెంట్లు చేస్తున్నారు. ఇక సినిమాల విషయానికి వస్తే సమంత ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. నటిగా మాత్రమే కాకుండా నిర్మాణ రంగంలోనూ తనదైన ముద్ర వేస్తున్నారు. ఆమె నిర్మాణంలో తెరకెక్కిన 'మా ఇంటి బంగారం' చిత్రంపై కూడా ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. అదే సమయంలో 'సెలబ్రిటీ మాస్టర్ చెఫ్ తమిళం' కార్యక్రమానికి హోస్ట్‌గా వ్యవహరిస్తూ.. మరోవైపు 'రక్త బ్రహ్మాండ్' అనే వెబ్ సిరీస్‌లోనూ భాగమవుతున్నారు. దీంతో వ్యక్తిగత విషయాలతో పాటు వరుస ప్రాజెక్టులతోనూ సమంత ఎప్పటికప్పుడు వార్తల్లో నిలుస్తున్నారు.



సంక్రాంతి రేసు నుంచి విశ్వంభర ఔట్! మార్చిలో మెగాస్టార్ డబుల్ ట్రీట్!

మెగాస్టార్ చిరంజీవి హీరోగా 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక సోషియో ఫాంటసీ చిత్రం 'విశ్వంభర'. భారీ బడ్జెట్‌తో, అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో రూపొందుతున్న ఈ విజువల్ వండర్‌పై మొదటి నుంచే భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే షూటింగ్ పూర్తికావడంతో పాటు పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా తుది దశకు చేరుకున్నాయి. అయితే ఈ సినిమా ఎప్పుడు ప్రేక్షకుల ముందుకు వస్తుందనే విషయంలో కొంతకాలంగా కొనసాగుతున్న సస్పెన్స్‌కు త్వరలోనే తెరపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఫిలింనగర్ వర్గాల సమాచారం ప్రకారం.. 'విశ్వంభర'ను 2027 మహాశివరాత్రి సందర్భంగా మార్చి నెలలో ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై నిర్మాణ సంస్థ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. వాస్తవానికి 'విశ్వంభర' ఎప్పుడో ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉంది. కానీ ఇది సోషియో ఫాంటసీ కథ కావడంతో సినిమాలోని విజువల్స్, గ్రాఫిక్స్ అత్యంత సహజంగా, అద్భుతంగా కనిపించాలనే ఉద్దేశంతో మేకర్స్ ఎక్కువ సమయం తీసుకున్నట్లు తెలుస్తోంది. విజువల్ ఎఫెక్ట్స్ విషయంలో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదనే ఉద్దేశంతో అంతర్జాతీయ స్థాయి నిపుణులతో పనులు చేయించినట్లు సమాచారం. క్వాలిటీ విషయంలో రాజీపడకపోవడం వల్లే సినిమా విడుదలలో ఆలస్యం జరిగినట్లు టాక్. ప్రస్తుతం సినిమా తుది కాపీకి సంబంధించిన పనులు పూర్తయినప్పటికీ.. భారీ స్థాయి చిత్రానికి సరైన విడుదల తేదీ, సోలో రిలీజ్ అవకాశాన్ని చూసుకుంటున్నారని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మెగాస్టార్ చిరంజీవి సినిమాలకు సంక్రాంతి సీజన్ ప్రత్యేకమైనది. దీంతో 'విశ్వంభర' కూడా 2027 సంక్రాంతి బరిలోకి వస్తుందని గతంలో ప్రచారం జరిగింది. అయితే అదే సమయంలో చిరంజీవి-బాబీ కొల్లి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మరో భారీ చిత్రం 'కాకా'ను జనవరి 13న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు.ఒకే హీరో నటించిన రెండు భారీ చిత్రాలు ఒకే పండుగ సీజన్‌లో విడుదలైతే కలెక్షన్ల పరంగా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. దీంతో రెండు సినిమాల మధ్య పోటీ లేకుండా 'విశ్వంభర'ను సంక్రాంతి రేసు నుంచి తప్పించి మార్చిలో విడుదల చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. 'విశ్వంభర'ను మహాశివరాత్రి సీజన్‌కు తీసుకురావడం వెనుక మరో కారణం కూడా ఉందని తెలుస్తోంది. ఫాంటసీ కథాంశం, దైవిక అంశాలతో తెరకెక్కుతున్న ఈ సినిమాకు శివరాత్రి పండుగ వాతావరణం మరింతగా కలిసొస్తుందని చిత్రబృందం భావిస్తున్నట్లు సమాచారం.అదే జరిగితే సంక్రాంతికి 'కాకా'తో సందడి చేయనున్న చిరంజీవి.. కేవలం రెండు నెలల వ్యవధిలోనే మార్చిలో 'విశ్వంభర'తో మరోసారి ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఒకే ఏడాది తొలి మూడు నెలల్లోనే మెగాస్టార్ నుంచి రెండు భారీ చిత్రాలు విడుదల కానుండటం అభిమానులకు డబుల్ ట్రీట్‌గా మారనుంది.



ఆయా షేర్ వీడియో సాంగ్ విడుదల

నేచురల్ స్టార్ నాని హీరోగా, 'దసరా' ఫేమ్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'ది ప్యారడైజ్'. ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర మంచి వసూళ్లు రాబట్టింది. అయితే ఈ సినిమా విడుదలకు ముందే పాటలు, మాస్ ఎలివేషన్స్‌తో 'ది ప్యారడైజ్' సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.ఇక ఈ చిత్రానికి సంబంధించిన తొలి పాట 'ఆయా షేర్' ఇప్పటికే ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుంది యూట్యూబ్‌తో పాటు డిజిటల్ వేదికలపై కూడా ఈ సాంగ్ అనేక రికార్డులు సాధించింది. దీంతో పాటు 'ది ప్యారడైజ్' మ్యూజికల్ ప్రమోషన్స్‌లో ఈ పాట కీలకంగా మారింది. తాజాగా ఈ పాటకి సంబంధించిన ఫుల్ వీడియో విడుదల చేశారు. ఈ పాటలోని నాని సిగ్నేచర్ స్టెప్పులకి ప్రతి ఒక్కరు ఫిదా అవుతున్నారు. 'ఆయా షేర్' పాటకు అనిరుధ్ రవిచందర్ అందించిన హై-వోల్టేజ్ సంగీతం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. కాసర్ల శ్యామ్ రాసిన ఎనర్జిటిక్ సాహిత్యానికి అద్దుల జంగిరెడ్డి, అర్జున్ చాందీ తమదైన శైలిలో గాత్రాన్ని అందించారు. పాటలోని క్యాచీ ట్యూన్, పవర్‌ఫుల్ బీట్స్, మాస్ కొరియోగ్రఫీ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్నాయి.యూత్, కాలేజీ విద్యార్థులతో పాటు అన్ని వర్గాల ప్రేక్షకుల్లో ఈ పాటకు మంచి క్రేజ్ ఏర్పడింది. సోషల్ మీడియా రీల్స్ నుంచి పబ్లిక్ ఈవెంట్స్, వేడుకల వరకు 'ఆయా షేర్' సందడి కనిపించింది. ముఖ్యంగా పాటలోని బీట్స్, హుక్ స్టెప్పులు అభిమానులను ఆకట్టుకోవడంతో ఇది సెలబ్రేషన్ సాంగ్‌గా మారిపోయింది. 'దసరా' వంటి ఊరమాస్ విజయాన్ని అందించిన శ్రీకాంత్ ఓదెల.. 'ది ప్యారడైజ్'లో నానిని మరింత రగ్గడ్, పవర్‌ఫుల్ పాత్రలో చూపించారు. నాని లుక్, బాడీ లాంగ్వేజ్, మేనరిజమ్స్, స్క్రీన్ ప్రెజెన్స్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచాయి. ఇప్పటివరకు కనిపించని విధంగా నాని కొత్త అవతార్‌లో కనిపించడం సినిమాపై అంచనాలు మరింత పెంచింది. కాయాదు లోహర్ కథానాయికగా నటించిన ఈ చిత్రంలో కలెక్షన్ కింగ్ మోహన్ బాబు, రాఘవ్ జుయల్, బాబు మోహన్, సంపూర్ణేష్ బాబు కీలక పాత్రల్లో నటించారు.

PRINTED AND PUBLISHED BY MUPPIRISETTY JAGADEESH, On behalf of CATERWEALTH MEDIA LLP, PRINTED at M/S. SREE SESHASAI ENTERPRISES, D.NO. NEW. 3-88, OLD. 3-22, GOSALA, CHANDRA THEATER ROAD, PENAMALURU-521151, KRISHNA DISTRICT, ANDHRA PRADESH, PUBLISHED AT CATERWEALTH MEDIA LLP, 3RD FLOOR, 59-12-9A, FIRST LINE, GAYATHRI NAGAR, VIJAYAWADA, NTR DISTRICT, ANDHRA PRADESH. EDITOR: MUPPIRISETTY JAGADEESH. RNI REGD NO. APTEL/2016/70247, Email I D : mahanagarap@gmail.com Phone : 9044417999